ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

ఆదివారం 27 అక్టోబరు 2024



నోరూరించే బేంబూ చికెన్


అరకు పర్యాటకులకు అదుపు ఆకర్షణ

- పర్యాటక ప్రాంతాల్లో జోరుగా వ్యాపారం
- తయారీ విధానం ప్రత్యేకం

- 8లో



అమ్మాయి పుడితే ఆమడ దూరం!



ఇంకా కొనసాగుతున్న లింగ వివక్ష

- ఆడపిల్ల పుట్టిందని భార్యను వదిలేసేందుకు సిద్ధమవుతున్న కొంతమంది ప్రబుద్ధులు

- ప్రసవానంతరం ఆమెను పుట్టింటి నుంచి తీసుకొచ్చేందుకు నిరాకరణ
- పెద్దల వద్ద పంచాయితీలు
- అక్కడా తెగకపోవడంతో గృహ హింస రక్షణ విభాగాన్ని ఆశ్రయిస్తున్న బాధితులు
- మానసిక, శారీరక వైకల్యంతో పుట్టినా వేధింపులు
- అంతా పురుషాహంకారం

"పెళ్లై రెండేళ్లవుతుంది. కొద్దిరోజుల కిందట పాప పుట్టింది. అమ్మాయి పుట్టిందని సంతోషపడ్డాను. ఆ సంతోషం కొన్ని గంటలు కూడా నిలవలేదు. అమ్మాయి పుట్టిందని చెప్పి అత్తింటి వాళ్లు చూసేందుకు కూడా రాలేదు. భర్త వచ్చి చూసి వెళ్లిపోయాడు. ఆ తరువాత నాలుగు నెలలు రాలేదు. పుట్టింటి నుంచి నన్ను తీసుకువెళ్లలేదు. తీరా ఇప్పుడు చూస్తే వదిలేస్తా అంటున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు'

- ఇదీ గృహ హింస (డొమెస్టిక్ వయొలెన్స్) సెల్‌కు గాజువాక ప్రాంతానికి చెందిన ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు.

"ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మళ్లీ పిల్లలు వద్దని చెప్పాను. అయినా వినలేదు. ఇప్పుడు మళ్లీ పాప పుట్టింది. నువ్వు పుట్టింటికి వెళ్లిపో అంటున్నారు. పిల్లలను కూడా పట్టించుకోవడం లేదు. నా తల్లిదండ్రులు ఆస్తులు అమ్మి పెళ్లి చేశారు. ఇప్పుడు నాతోపాటు మరో ముగ్గురి భారాన్ని మోసే స్థోమత వాళ్లకు లేదు. ఏం చేయాలో తెలియడం లేదు. మీరే న్యాయం చేయాలి'

- ఇదీ మధురవాడ ప్రాంతానికి చెందిన మరో మహిళ ఫిర్యాదు.

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుడితే చాలామంది లక్ష్మీదేవి పుట్టిందని సంతోషిస్తారు. కానీ, కొద్దిమంది ఇప్పటికీ ఆడపిల్లలను భారంగా భావిస్తున్నవాళ్లు ఉన్నారు. అమ్మాయి పుట్టిందని కట్టుకున్న భార్యను వదిలేసేందుకు కూడా సిద్ధపడుతున్నారు. ఇటువంటి కేసులు ఎంవీపీ కాలనీలోని డొమెస్టిక్ వయలెన్స్ సెల్‌లో నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ 20కిపైగా నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది 20 కేసులు..

ఆడపిల్ల పుట్టిందని భార్యను వేధిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది ... మిగతా 6వ పేజీలో

3 ఇసుక డిపోలు

భీమిలి, ముడసర్లోవ, అగనంపూడిలో ఏర్పాటు

- ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- కొద్ది మొత్తం అవసరమయ్యే వారిని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం
- నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగింత
- త్వరలో టెండర్లు



నగర శివారులో ఒడిశా నుంచి వస్తున్న ఇసుక లారీ పర్మిట్లు తనిఖీచేస్తున్న విజిలెన్స్ టీమ్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణదారులకు ఇసుక అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకోసం అగనంపూడి, ముడసర్లోవ, భీమిలిలో స్టాకు పాయింట్లు ఏర్పాటుచేస్తోంది. కొద్ది మొత్తం ఇసుక అవసరం ఉన్నవారిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

గత ప్రభుత్వ హయాంలో భీమిలి, ముడసర్లోవ, అగనంపూడి ప్రాంతాల్లో ఇసుక డిపోలు ఏర్పాటుచేశారు. కొద్దికాలం నిర్వహణ ఏపీఎండీసీ చూసింది. ఆ తరువాత ప్రభుత్వం నెమ్మదిగా ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. ముడసర్లోవలోని డిపోను గత ప్రభుత్వ హయాంలోనే మూసివేయగా, భీమిలి, అగనంపూడి డిపోలను రెండు నెలల క్రితం కూటమి ప్రభుత్వం ఎత్తివేసింది. ఇసుక అవసరమైనవారు రాజమండ్రి, శ్రీకాకుళంలో రీచ్‌లకు వెళ్లి తెచ్చుకోవాలని సూచించింది. అయితే బల్క్‌గా అంటే ఐదు టన్నులు, అంతకు మించి అవసరం ఉన్నవారం రీచ్‌లకు వెళుతున్నారు. ఒకటి లేదా రెండు టన్నులు కావాల్సినవారు నగరంలో ప్రైవేటు వ్యాపారుల వద్ద టన్ను రూ.1800 నుంచి రూ.రెండు వేల పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. అయితే రెవెన్యూ, గనుల శాఖ అధికారులు దాడులు చేయడంతో నగరంలో ఎక్కువ మంది ఇసుక వ్యాపారాన్ని నిలిపివేశారు. దీంతో తక్కువ మొత్తం ఇసుక కావాల్సినవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఇసుక స్టాకు పాయింట్లు అవసరమని కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను ప్రజా ప్రతినిధులు, నిర్మాణదారులు కోరారు. దీంతో ఆయన ప్రభుత్వానికి సమస్యను నివేదించగా స్టాకు పాయింట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. గతంలో ఉన్న మూడుచోట్ల స్టాకు పాయింట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే గనుల శాఖ కాకుండా ప్రైవేటు సంస్థలకు ఈ స్టాకు పాయింట్ల నిర్వహణ అప్పగించాలని నిర్ణయించారు. త్వరలో ... మిగతా 6వ పేజీలో

సీఎం రమేశ్‌కు సత్కారం



రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దంపతులు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి, వంశీకృష్ణ శ్రీనివాస్ ఉన్నారు. - 8లో



చిన్న మధ్య తరహా పరిశ్రమలకు కొత్త పాలసీ

- రూ.50 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం... 22 లక్షల మందికి ఉపాధి
- పారిశ్రామికవేత్తల సదస్సులో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్
- దశలవారీగా సమస్యలు పరిష్కారం: ఎంపీ ఎం.శ్రీభరత్

- 8లో

రూ.67కు కిలో కంది పప్పు

వచ్చే నెల నుంచి బియ్యం కార్డుదారులకు పంపిణీ

- జిల్లాకు 552 టన్నులు కేటాయింపు
- 238 టన్నుల పంచదార కూడా...
- అర కిలో రూ.17
- గత ప్రభుత్వంలో అరకొర సరఫరాయే...



విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చౌక డిపోల ద్వారా బియ్యం కార్డుదారులకు పూర్తిస్థాయిలో సరుకులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నవంబరు నుంచి బియ్యం, పంచదార, కందిపప్పు అందించనున్నది. ఇందుకోసం జిల్లాకు 552 టన్నుల కందిపప్పు, 238 టన్నుల పంచదార కేటాయించింది. కందిపప్పులో సగం ఇప్పటికే గోదాములకు చేరగా, డిపోలకు పంపించారు. మిగిలిన సరుకు నెలాఖరుకల్లా జిల్లాకు చేరనున్నది. పంచదార 238 టన్నులు గోదాములకు చేరిందని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత తెలిపారు. ప్రతి కార్డుదారుడికి రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అరకిలో పంచదార ఇస్తామన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం, పంచదార కార్డుదారులందరికీ ఇచ్చేవారు. కందిపప్పు మాత్రం అరకొర సరఫరా చేయడంతో ఎండీయూ వాహనదారులను కార్డుదారులు నిలదీస్తుండేవారు. ఆ తరువాత (ఏడాది క్రితం) కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిపివేసి గోధుమ పిండి ఇవ్వడం మొదలెట్టారు. అది కూడా నాసిరకంగా ఉండడంతో కార్డుదారులు తీసుకునేవారు కాదు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర పెరగడంతో రాయితీపై ఇవ్వాలని కార్డుదారులు కోరినా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ... మిగతా 6వ పేజీలో

డీఆర్వోగా భవానీశంకర్, డీఈవోగా ప్రేమ్‌కుమార్, బాధ్యతల స్వీకారం

- 6లో

గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి బ్యాచ్‌లు హల్‌చల్ చేస్తున్నారు. గత పది రోజుల్లో మూడుచోట్ల ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎటువంటి వివాదం లేకపోయినా డబ్బుల కోసం దుకాణదారులతోనూ, స్థానికులతోనూ గొడవ పెట్టుకోవడం, డబ్బులు ఇవ్వకపోతే కొట్టడం చేస్తున్నారు. వీటికి సంబంధించిన వీడియోలను కొందరు స్థానికులు గంజాయి సేవించిన వారికి తెలియకుండా చిత్రీకరించి పోలీసులకు, విలేకరులకు పంపిస్తున్నప్పుడు మాత్రమే ఇవి వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల చిప్పాడ వద్ద డబ్బుల కోసం అయిదుగురు యువకులు స్థానికులతో గొడవకు పడి వారిని గాయపరిచారు. ఇందులో కొంతమంది గంజాయి సేవించి ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో కూడా కొంతమంది స్థానికులతో గొడవ పడ్డారు. ఐదు రోజుల క్రితం నగరపాలెం కూడలిలో కూడా యువకులు గంజాయి మత్తులో హల్‌చల్ చేశారు. ఏ కారణం లేకుండా గొడవలకు దిగడం, వారితో వారించిన వారిపై దాడి చేయడం పరిపాటిగా మారింది. పోలీసులు ఈవిషయమై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

మద్దిలో పశుగణన ప్రారంభం

పద్మనాభం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పశువుల పెంపకం ప్రధాన ఆదాయ వనరు అని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మద్ది. తునిపాలెం గ్రామాల్లో పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పశు పోషణ వల్ల అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. పశుగణనకు రైతులంతా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి శ్రీనివాసరావు, మద్ది పాల సొసైటీ మాజీ డైరెక్టర్లు బుగత ప్రకాశ్, కనకల సన్యాసినాయుడు,బుగత బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి మండలంలో...

భీమునిపట్నం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నుంచి పశుగణన ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పశు వైద్య శాఖ సిబ్బంది గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి పాడి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు వంటి వాటిని లెక్కిస్తారు. వీటితో పాటు వీధి కుక్కల సమాచారం కూడా సేకరిస్తారు.

ఆధ్యాత్మిక భావంతో మానసిక ప్రశాంతత

పద్మనాభం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక భావం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి గొర్రెపాటి వెంకట లక్ష్మీనాయుడు అన్నారు. శనివారం మద్దిలో ఉన్న ధర్మ శాస్త్ర సేవా పీఠంలో అయ్యప్ప, భవానీ, శివ మాలలు వేసిన వారికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెదఎర్నినాయుడు, ఎంపీపీ రాంబాబు పాల్గొన్నారు.

రమణకు ఏఐఆర్ ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు

సింహాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నాదస్వర విద్వాంసుడిగా విధులు నిర్వర్తిస్తున్న నర్సిపురం వెంకటరమణకు ఆల్ ఇండియా రేడియో ఏ-టాప్ గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు లభించింది. ప్రతి పదేళ్లకు ఒకసారి ఏ-గ్రేడ్ కళాకారులకు ఆల్ ఇండియా రేడియో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, ఎంపిక చేసిన వారికి మాత్రమే ఈ గౌరవం ఇస్తుంది. ఈమేరకు ఈ ఏడాది శ్రీకాళహస్తి దేవస్థానం విద్వాంసుడితో పాటు వెంకటరమణకు ఏ-టాప్ గ్రేడ్ కళాకారుడిగా గుర్తింపు ఇస్తూ ఏఐఆర్ విశాఖ స్టేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రకాశరావు శనివారం సర్టిఫికెట్ అందజేశారు. వెంకట రమణకు ఈఓ త్రినాథరావు, ఉద్యోగుల సంఘం నాయకుడు రామరాజు, నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు, సహోద్యోగులు అభినందనలు తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

భీమునిపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 3వ వార్డు నెహ్రూ రోడ్‌లో వున్న మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ సభ్యులు శనివారం నోట్ పుస్తకాలు, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఆనంద్, ఉపాధ్యాయిని సుహాసిని వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్ సాధించిన వారికి తమ ఫౌండేషన్ ద్వారా రూ. 3 వేలు నగదు బహుమతి అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఎం. శివరాణి, జయప్రద, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.67కు కిలో కంది పప్పు

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అక్టోబరు నెలకు జిల్లా డిమాండ్‌లో 20 నుంచి 30 శాతం కందిపప్పు కేటాయించినా, గోదాములకు అంతకంటే తక్కువ వచ్చింది. రెండో వారం నాటికి మరికొంత సరఫరా చేశారు. అయితే నవంబరు నుంచి పూర్తిస్థాయిలో కందిపప్పు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీతో పౌర సరఫరాల సంస్థలో చలనం వచ్చి మిల్లర్ల నుంచి కొనుగోలు చేసి మరీ జిల్లాలకు సరఫరా చేశారు. దీంతో కార్డుదారులందరికీ కందిపప్పు, పంచదార అందిస్తామని డీలర్లు చెబుతున్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.180 వరకు ఉండగా కార్డుదారులకు రూ.67కు అందించనున్నారు. దీనికితోడు దీపావళి నుంచి ఉచిత సిలిండర్ పథకం ప్రారంభం కానున్నది. సోమవారం దీనికి సంబంధించి పూర్తి విధి విధానాలు రానున్నాయి.

భీమిలిలో లక్ష సభ్యత్వాల నమోదు లక్ష్యం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- టీడీపీ సభ్యత్వాల నమోదు ప్రారంభం



ఆన్‌లైన్‌లో సభ్యత్వాన్ని నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాల నమోదు లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం బీచ్‌రోడ్‌లో ఉన్న క్యాంప్ కార్యాలయంలో ఆయన టీడీపీ సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో 1.76 లక్షల ఓట్లు వేసి ప్రత్యర్థి కంటే అత్యధికంగా 92,401 ఓట్ల మెజారిటీతో తనకు గెలుపు ఇచ్చారని, అదేవిధంగా సభ్యత్వ నమోదులోనూ లక్ష మార్క్‌ను అందుకుని నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని నిరూపించాలని కోరారు. పార్టీ నిర్దేశించిన సమయం కంటే ముందుగానే లక్ష్యానికి చేరుకోవాలని, అందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. సభ్యత్వ నమోదు పురోగతిని ప్రతిరోజూ స్వయంగా సమీక్షిస్తానన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గౌరవం ఉంటుందని, నామినేటెడ్, పార్టీ సంస్థాగత పదవుల్లో ప్రాధాన్యం కల్పిస్తానని తెలిపారు.సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అంకితభావంతో చేపట్టాలని కోరారు. మొదటిసారిగా కార్యకర్తల సంక్షేమానికి బీమా సౌకర్యం కల్పించింది టీడీపీయేనని చెప్పారు. తొలుత ఆయన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆన్‌లైన్‌లో మొదటి సభ్యత్వాన్ని స్వీకరించారు. భీమిలి మండల టీడీపీ అధ్యక్షుడు దంతులూరి అప్పలనరసింహరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కోరాడ రాజబాబు, గాడు వెంకటప్పడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్, పాసి నరసింగరావు, కోరాడ రమణ, దామోదరరావు, కోరాడ రమణ, జి. అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, జీవన్‌కుమార్, అక్కరమాని వెంకటరావు, పిట్టా సురేశ్, బడిగంటి నీలకంఠం, చందక అప్పలరాజు, తాత్రాజు అప్పారావు పాల్గొన్నారు. కాగా కార్యక్రమం ముగిసిన తర్వాత సమావేశ మందిరంలో 2వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బడిగంటి నీలకంఠంను అనూహ్యంగా వార్డు పార్టీ కార్యదర్శి పిట్టా వెంకటరావు కొట్టడంతో అందరూ అవాక్కయ్యారు. ఏమైందన్న విషయం ఎవరికీ అర్థం కాలేదు. ఇద్దరూ మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు కావడం విశేషం.



హుద్‌హుద్ తుఫాన్‌కు పాడైన మార్కెట్ యార్డు గిడ్డంగి



తుప్పల మధ్య మార్కెట్ యార్డు కార్యాలయం

శిథిలావస్థలో పద్మనాభం మార్కెట్ యార్డు

- హుద్‌హుద్ తుఫాన్‌కు పాడైన కార్యాలయం, గిడ్డంగి
- నేటికీ పునర్నిర్మాణానికి నోచుకోని వైనం
- పంటల నిల్వకు ఇబ్బంది పడుతున్న రైతులు

పద్మనాభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పదేళ్ల క్రితం వచ్చిన హుద్‌హుద్ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న ఈ కార్యాలయం పునర్నిర్మాణంపై పాలకులు, అధికారులు శీతకన్ను వేశారు. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ యార్డును ఇన్నేళ్లుగా పాలకులు నిర్లక్ష్యంగా వదిలేసి నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 1997లో అప్పటి భీమిలి మార్కెట్ కమిటీ పరిధిలోని పద్మనాభంలో మార్కెట్ యార్డును నాటి ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు చొరవతో నిర్మించారు. రెండు గిడ్డంగులతో పాటు మార్కెట్ కమిటీ కార్యాలయం నిర్మించారు. రైతులు పంట దినుసులను ఎండబెట్టుకోవడానికి ప్లాట్‌ఫారమ్ కూడా కట్టారు. గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్లుగా వ్యవహరించిన వరహాలరాజు, మొకర నారాయణరావు ఈ యార్డు అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారు. యార్డులో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రాయితీపై విక్రయించేవారు. రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను నిల్వ చేసుకోవడానికి గిడ్డంగుల్లో అవకాశం కల్పించేవారు. దాచుకున్న సరకుపై రైతు బంధు పథకం ద్వారా కర్షకులకు వడ్డీ లేని రుణం ఇచ్చేవారు. రైతులు తమ సరకును అమ్ముకున్న తరువాత తీసుకున్న రుణాన్ని చెల్లించేవారు. దీంతో పాటు రైతుల పొలాలకు దినుసులు తెచ్చుకోవడానికి రోడ్లు కూడా మార్కెట్ యార్డు ద్వారా వేసేవారు. కొంతకాలం వరకు ఈ గిడ్డంగుల్లో పౌర సరఫరాల శాఖ కూడా బియ్యం, ఇతర సరకులను నిల్వ చేసేది. రైతులకు బహుళ ప్రయోజనకరంగా ఉండే ఈ యార్డులోని రెండు పెద్ద షైకప్పులు 2014లో వచ్చిన హుద్‌హుద్ తుఫాన్‌కు పూర్తిగా ఎగిరిపోయాయి. నాటి నుంచి దీని బాగోగులు పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. పాలకులు దీనిపై దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు ఆదివారం నుంచి జరగనున్నాయి. స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏడాది పొడవునా జరిగే స్వామివారి ఉత్సవాలు, అర్చనాది కార్యక్రమాల్లో చోటుచేసుకునే దోషాల నివారణకు పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆదివారం సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 28న విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, విశేష హోమాలు, పవిత్ర అభిమంత్రణ, పూర్ణాహుతి జరుపుతారు. 29న విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అనంత పద్మనాభస్వామి, కుంతీమాధవస్వామిలకు అష్టకలశ స్థాపన, పంచామృతాభిషేకం అనంతరం నిత్య హోమాలు, పవిత్రాల సమర్పణ చేస్తారు. 30న విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం, పవిత్ర విసర్జన అనంతరం స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



ఆలయంలో సినీ హీరోయిన్ అన్ను

సింహాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, విజయనగరం జిల్లా ఆర్‌డీఓ సింగాల శ్రీనివాసమూర్తి, సినీ హీరోయిన్ అన్ను, సినీ రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా, గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

ఎండాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో యువకుడిపై జరిగిన హత్యాయత్నం కేసులో పీఎంపాలెం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. అందులో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ హోంకి తరలించారు. ఈనెల 23న రాత్రి బీచ్ రోడ్డులోని జువైల్ అపార్ట్‌మెంట్‌కి వెళ్లే దారిలో యువకుడిపై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు శుక్రవారం రాత్రి ఐటీ రోడ్డులో పోలీసులను చూసి బైక్‌పై పారిపోతుండగా అనుమానం వచ్చి పట్టుకుని విచారించారు. ఆ రోజు రాత్రి ఉద్దేశ పూర్వకంగానే జామి నవీన్‌ను గాయపర్చినట్టు మన్యాల సింహాద్రితో పాటు మైనర్ ఒప్పుకున్నారు. ఈమేరకు వారి నుంచి బైక్, సెల్ ఫోన్‌తో పాటు స్టీల్ రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు శనివారం నుంచి ప్రారంభమైంది. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో సభ్యత్వ నమోదు చేపడుతున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ ఉత్తర నియోజకవర్గం పరిధి బర్మాక్యాంపులోని ఏఎస్ఆర్‌నగర్, దక్షిణ నియోజకవర్గం జాలారిపేట సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమిలిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంవీపీ కాలనీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమలోని గోపాలపట్నంలో ఎమ్మెల్యే గణబాబు సభ్యత్వం తీసుకున్నారు. గాజువాక పట్టణ పార్టీ కార్యాలయంలో నాయకులు సభ్యత్వం తీసుకున్నారు. ఇంకా ప్రతి వార్డులో వార్డు అధ్యక్షుల పర్యవేక్షణలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

రోడ్డుపై భక్తుల వంటా, వార్పు



రోడ్డుపై వంట చేస్తున్న యాత్రికులు

సింహాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న దర్శనానికి బస్సుల్లో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు కొండదిగువన సరైన వసతి లేకపోవడంతో బస్సులు నిలిపి ఉంచిన చోటే వంట చేసుకోవాల్సి వస్తోంది. దీంతో వంటలపై దుమ్ము, ధూళి పడుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. కొండ దిగువ భక్తులకు ఉచిత వసతి సౌకర్యం ఏర్పాటు చేసే దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గ్రామసభలో వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

భూముల రీసర్వే సభలో 31 వినతుల స్వీకరణ

పద్మనాభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుడ్డివలసలో భూముల రీ సర్వేలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి శనివారం నిర్వహించిన గ్రామ సభలో 31 వినతులు వచ్చాయి. తహసీల్దార్ కె. ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రైతుల నుంచి పలు వినతులను స్వీకరించారు. వీటిలో విస్తీర్ణంలో సవరణలకు 15, పేర్ల మార్పునకు 13, జాయింట్ ఎల్‌పీఎం అభ్యంతరాలపై రెండు, సరిహద్దుల సవరణకు ఒక దరఖాస్తు వచ్చింది. కార్యక్రమంలో మండల డీటీ చంద్రశేఖర్, రీసర్వే డీటీ వరలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రేమ్‌కుమార్



కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్‌కు మొక్క అందిస్తున్న డీఈవో

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):జిల్లా విద్యాశాఖాధికారిగా ఎన్.ప్రేమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ బదిలీపై విశాఖ వచ్చారు. సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్న ప్రేమ్‌కుమార్‌కు రెండు కార్యాలయాల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

డీఆర్వో బాధ్యతల స్వీకారం



భవానీశంకర్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా బీహెచ్ భవానీశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఆర్వోగా ఉన్న మోహన్‌కుమార్‌ను చిత్తూరు బదిలీ చేసి ప్రభుత్వం...ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న భవానీశంకర్‌ను నియమించింది. కొత్తగా విధుల్లో చేరిన భవానీశంకర్‌ను కలెక్టరేట్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా బాధ్యతలు తీసుకున్న భవానీశంకర్ మర్యాదపూర్వకంగా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిశారు.

ప్రచార బోర్డులో తప్పులు

సింహాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాద పథకం విరాళాల సేకరణ, అందుకు సంబంధించిన సమాచారాన్ని భక్తులకు తెలిపేందుకు సింహగిరిపై పీఆర్‌ఓ కార్యాలయం వద్ద అధికారులు ప్రచార బోర్డు ఏర్పాటు చేశారు. అందులో కొన్ని తప్పులు దొర్లిన సం గతిని సిబ్బంది గుర్తించపోవడం శోచనీయం. ముఖ్యంగా దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వుల మేరకు అన్నప్రసాద పథకం అని రాయడానికి బదులు అన్నదా నం అని రాయడంతో భక్తుల నుంచి అభ్యం తరాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బోర్డులో ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపు నకు సంబంధించిన సమాచారం కానీ, ఆన్‌లైన్‌లో విరాళం చెల్లించేందుకు అవసరమైన దేవస్థానం వెబ్‌సైట్ అడ్రస్ కానీ ముద్రించలేదు. అధికారులు తక్షణమే స్పందించి బోర్డులోని తప్పులను సరి చేయాలని భక్తులు కోరుతున్నారు.

3 ఇసుక డిపోలు

... 5వ పేజీ తరువాయి

టెండర్లు పిలిచి తక్కువ మొత్తం కోట్ చేసిన సంస్థలకు స్టాకు పాయింట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. దీనికి సంబంధించి విధి విధానాలు రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం జారీచేయనున్నది.

ఒడిశా ఇసుకపై విజిలెన్స్

నగరానికి ఒడిశా నుంచి ఇసుక వస్తుండడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. గనులు, రెవెన్యూ, పోలీస్, రవాణా, పంచాయతీరాజ్, జల వనరుల శాఖ అధికారులు, సిబ్బందితో కూడిన విజిలెన్స్ బృందం మూడు రోజుల క్రితం నగర శివారులో ఒక లారీని పట్టుకుని రూ.30 వేల జరిమానా విధించారు.



ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షం నీరు

మధురవాడలో భారీ వర్షం

మధురవాడ, అక్టోబరు 26 : మధురవాడలో శనివారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఎప్పటిలాగే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఇక్కడ సర్వీసు రోడ్డుకి ఇరువైపులా కాలువల్లో పూడికలు తీయకపోవడంతో ఈ పరిస్థితి పునరావృతమవుతోంది. అలాగే మధురవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సిగ్నల్ పాయింట్ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు బారులు తీరాయి. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

సింహాద్రినాథుడికి వైభవంగా ఆర్జిత సేవలు



స్వామివారికి గరుడ సేవ చేస్తున్న అర్చకుడు

సింహాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠనంతో తులసీ దళార్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలిచ్చి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పూర్వపు ఈఓ, విజయనగరం డీఆర్‌ఓ సింగాల శ్రీనివాసమూర్తి సకుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ఘనంగా పంచకర్ల సందీప్ జన్మదిన వేడుకలు



సందీప్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జన సైనికులు

ఎండాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త పంచకర్ల సందీప్ జన్మదిన వేడుకలు ఎండాడలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సందీప్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అమ్మాయి పుడితే ఆమడదూరం!

... 5వ పేజీ తరువాయి

నమోదైన 20 కేసుల్లో కొత్తగా వివాహమైనవారు ఐదుగురు ఉన్నారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టిందని మరో పది మంది వరకు, మూడో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో మరో ఇద్దరు ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరైతే మూడోసారి గర్భం వచ్చినప్పుడు ముందుగానే పరీక్ష చేయించి ఆడ పిల్ల పుడుతుందని చెప్పారంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటువంటి వేధింపులు భరించలేక బాధితులు డీవీ సెల్‌తోపాటు పెద్దల దృష్టికి తీసుకువెళుతున్నారు.

విడాకులు ఇచ్చేయాలని..

అమ్మాయి పుట్టిందని భార్యను పూర్తిగా విడిచిపెట్టేందుకు కొంతమంది సిద్ధపడుతున్నారు. ఇందులో కుటుంబ సభ్యులు ప్రమేయం కూడా ఉంటోంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ల మాటలు విని ఎంతోమంది భర్తలు విడాకులు నిర్ణయాన్ని తీసుకుంటున్నారు. ప్రసవానికని పుట్టింటి వద్ద దించి వస్తున్న వాళ్లు...ఆ తరువాత ఆడపిల్ల పుడితే అటు వైపు చూడడం లేదు. అమ్మాయి పుట్టింది కాబట్టి తనకు విడాకులు ఇచ్చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. స్థానికంగా పెద్దల సమక్షంలో పంచాయితీలు పెడుతున్నారని, వారు చెప్పినా వినిపించుకోకపోవడంతో తమ వరకు ఫిర్యాదులు వస్తున్నట్టు డీవీ సెల్ అధికారులు చెబుతున్నారు.

వైకల్యంతో పుట్టినా ఇబ్బందే..

పిల్లలు వైకల్యంతో పుట్టినా కొందరు తల్లిపై నెపాన్ని నెట్టేస్తున్నారు. డౌన్ సిండ్రోమ్, మానసిక సమస్యలు, చేతులు, కాళ్లలో వైకల్యంతో పిల్లలు పుట్టినా వదిలేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాదిలో ఇటువంటి కేసులు ఐదు వరకు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. పుట్టిన పిల్లల అవకరాలకు భార్యను బాధ్యులను చేసి విడాకులు ఇచ్చేందుకు సిద్ధపడడం అత్యంత దారుణమైన విషయమని డీవీ సెల్ అధికారులు పేర్కొంటున్నారు. ఆయా కేసులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, అయితే పరిష్కారం పెద్దగా లభించడం లేదని వాపోతున్నారు. తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా పురుషులు విడాకులు అన్న మాటను పట్టుకుని ఉంటున్నారని, కొందరు మెత్తబడినా కుటుంబ సభ్యులు అందకు అంగీకరించడం లేదని చెబుతున్నారు. దీనివల్ల కోర్టుల వరకు కేసులు వెళుతున్నట్టు చెబుతున్నారు. కొన్ని ఇప్పటికీ కౌన్సెలింగ్ దశలో ఉన్నాయంటున్నారు.

కారణం తండ్రే..

ఆడ పిల్ల, మగ పిల్లాడు ఎవరు పుట్టినా దానికి పురుషుడి క్రోమోజోములే కారణం. కానీ, ఈ విషయం తెలియక చాలామంది తల్లిని బాధ్యులుగా చూసి వేధింపులకు గురిచేస్తుంటారు. మహిళలో ఎక్స్‌ఎక్స్ క్రోమోజోమ్స్ ఉంటాయి. పురుషుల్లో ఎక్స్, వై క్రోమోజోమ్స్ ఉంటాయి. మహిళలో ఉండే ఎక్స్ క్రోమోజోమ్‌తో పురుషుడిలో ఉండే ఎక్స్ క్రోమోజోమ్ కలిస్తే ఆడ పిల్ల, వై క్రోమోజోమ్ కలిస్తే మగబిడ్డ పుడతారు. కానీ, ఈ విషయం తెలియక ఎంతోమంది పురుషులు ఆడ పిల్ల పుట్టడానికి తల్లిని బాధ్యురాలిని చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

లింగ వివక్ష నేరం

- డాక్టర్ టి.పద్మావతి, విశ్రాంత గైనకాలజిస్టు, కేజీహెచ్

లింగ వివక్ష చూపించడం నేరం. ఇటువంటి వివక్ష చూపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. ఆడ పిల్ల పుట్టడానికి తల్లి కారణం కాదు. పురుషుడి క్రోమోజోమ్స్ వల్లే ఆడ పిల్లగానీ, మగపిల్లాడు గానీ పుడతాడు. దీనికి తల్లిని బాధ్యురాలిని చేయడం తప్పు. పిల్లలు పుట్టక ఎంతోమంది తల్లిదండ్రులు మథనపడుతున్నారు. ఈ మధ్యకాలంలో సంతాన లేమి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆడ, మగ అంటూ లింగ వివక్ష చూపించడం సమంజసం కాదు. అబ్బాయిలకు ఎందులోనూ తీసిపోని విధంగా అమ్మాయిలు రాణిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అబ్బాయిలు కంటే అమ్మాయిలే అనేక రంగాల్లో ముందంజలో ఉన్నారు. ఈ విషయంలో అపోహలు వీడి ఎవరు పుట్టినా అపురూపంగా చూసుకోవాలి. ఎందరికో ఉన్న సమస్య మీకు లేనందుకు ఆనందంగా ఉండాలి.

నేడు సీఐటీయూ కార్యాలయం ప్రారంభం

పద్మనాభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :పద్మనాభంలో నూతనంగా నిర్మించిన సీఐటీయూ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్టు ఆ సంఘం సీనియర్ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి చెప్పారు. కార్యాలయాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు కె. లోకనాథం ప్రారంభిస్తారని తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

20వ వార్డులో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు స్వీకరిస్తున్న పోతన్నరెడ్డి తదితరులు

పెదవాల్తేరు, అక్టోబరు 26 : తెలుగుదేశం పార్టీ 2024-26కు సంబంధించిన సభ్యత్వ నమోదును ఆ పార్టీ 20వ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం చినవాల్తేరు, రజిక వీధి, కొయ్యవీధి తదితర ప్రాంతాల్లో సభ్యత్వాలను నమోదు చేశారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు పోతన్నరెడ్డి తెలిపారు. ఈ సభ్యత్వాన్ని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూర్తి యాదవ్, మదీనీ, మురళి, దేవుడుబాబు, సీతన్న, వినయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో రెండు నెలల చిన్నారికి శస్త్రచికిత్స



వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించిన చిన్నారి

ఆరిలోవ, అక్టోబరు 1 : (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని బరంపురం సమీపం గొల్లబం గ్రామానికి చెందిన నెలల చిన్నారికి శనివారం ఉదయం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గొల్లబం గ్రామానికి చెందిన యశోద, బాలరాజు దంపతులకు పుట్టిన రెండు నెలల చిన్నారికి కళ్లలో మచ్చలు ఏర్పడడంతో సరిగా కనిపించలేదు. దీంతో ఆ దంపతులు ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిని సంప్రదించగా, వైద్యులు తమ ప్రయత్నంలో భాగంగా శస్త్రచికిత్స నిర్వహించి చూపు రప్పించారు. తమ బిడ్డకు చూపు ప్రసాదించిన వైద్యులకు యశోదబాలరాజు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

● వీనమ్ : మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం),శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● పొట్టేల్ : వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● ఎంతపనిచేసావ్ చంటి : వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● లగ్గం : విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)

● దేవర :జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● వేట్టయాన్ : సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)

● విశ్వం : శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● జనక అయితే గనక : శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 28, క్యారేట్ 54 దొండకాయలు 36, బంగాళ దుంపలు 31, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)60, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 30, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

శ్మశానంలో సమస్యల ఘోష

» పెదజాలారిపేట శ్మశాన వాటికలో కనీస సదుపాయల కరువు
» వసతుల కల్పనపై చిన్నచూపు
» అంతిమ సంస్కారాల సమయంలో మృతుల బంధువుల ఇబ్బందులు
» పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పెదజాలారిపేటలో శ్మశనవాటిక



ఏడాది పొడవునా తాళం వేసి ఉండడంతో నిరుపయోగంగా మారిన భవనం

పెదవాల్తేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలోని శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు కల్పనపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర పాలక అభివృద్ధి సంస్థ శ్మశాన వాటికల నిర్వహణను పూర్తిగా విస్మరిస్తోందని పలువురు మండిపడుతున్నారు. వాస్తవానికి మతం, కులం వంటి బేధాలు లేకుండా అందరికీ శ్మశాన వాటికల అవసరం ఉంటుంది. కానీ ఎందుకో శ్మశానం అనగానే ఇటు ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పలు శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు లేని పరిస్థితి. దీంతో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో మృతుల బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జీవీఎంసీ 19వ వార్డులో పెదజాలారిపేట వాల్తేరు డిపో సముద్ర తీరానికి అనుకుని శ్మశానవాటిక ఉంది. ఈ శ్మశాన వాటికకు జీవీఎంసీ 19, 20, 21వ వార్డులకు సంబంధించి ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల నిర్వహణకు ఇక్కడకు తీసుకువస్తారు. అయితే అంత్యక్రియలు చేపట్టే సమయంలో అవసరమయ్యే ఏ మాత్రం వసతులు లేవు. దీంతో మృతుల కుటుంబీకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటుంటారు. నీరు ఏర్పాటు చేసుకోవడం, కట్టెలు వెంట తెచ్చుకోవడం వంటివి చేస్తుంటారు. అయితే ఇది ఆర్థికంగా భరించే వారు మాత్రం చేసుకోగలుగుతున్నారు. పేద, దిగువ మధ్య తరగతి వారు, పెద్దగా బంధువులు లేని వారికి ఇది ఇబ్బందిగానే ఉంటుంది. ఈ శ్మశాన వాటికలో సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

ఈ శ్మశానవాటిక నిర్వహణ లేక పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. ప్రహరీ, గేటు వంటివి లేకపోవడంతో రాత్రయితే చాలు మందుబాబులు చేరుతుంటారు. మత్తు పదార్థాలు తీసుకునే వారూ ఇక్కడే తిష్ఠ వేస్తుంటారు. వీరి ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. దీంతో ఇటు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. కాటి కాపరి కూడా లేకపోవడంతో ఆకతాయిలను అడ్డుకునే వారే లేకుండా పోతున్నారు. అంతిమ సంస్కారాలకు వచ్చే వారి నుంచి పూడ్చిడానికైనా 6,500, దహనానికి రూ.8 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యుడు, బంధువో మృతి చెందిన పుట్టెడు దుఃఖంలో ఉన్న వారు ఆ సమయంలో బేరసారాలు చేయలేక, నిలదీయ లేక వారు అడిగిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. పేదలకు ఇది భారంగానే ఉంటోంది.

మరణ ధ్రువపత్రాలకు తప్పని ఇబ్బందులు

ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని పథకాలు, బీమా వంటివి పొందాలంటే మరణ ధ్రువీకరణ పత్రం అవసరం. ఈ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించిన వారికి ఈ ధ్రువపత్రం పొందడం కూడా కష్టంగా మారింది. మృతి చెందినవ్యక్తి వివరాలు నమోదు చేయడానికి ఇక్కడ ఎవరూ ఉండడం లేదు.అప్పుడు ఉన్న పరిస్థితుల్లో అంతిమ సంస్కారాలు కానిచ్చి వెళ్లిపోతున్నారు. ఆ తర్వాత మరణ ధ్రువపత్రం కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

ఆ భవనం ఎందుకో మరి?

గతంలో శ్మశన వాటిక అవరణలో ఓ భవనాన్ని నిర్మించారు. దీన్ని ఎందుకు నిర్మించారో తెలియదు. పోనీ దాన్ని ప్రారంభించి కాటికాపరిని నియమించి వినియోగించుకోవాలనే చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఆ భవనం అందుబాటులోకి తెస్తే కనీసం వర్షాల సమయంలో అక్కడ ఉండే అవకాశమైనా ఉంటుంది.

ఈ శ్మశాన వాటికలో కనీస వసతులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై దృషి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగులకు మెరుగ్గా వైద్య సేవలు అందించాలి

» వైద్యులతో కలెక్టర్ హరేంధర్‌ప్రసాద్ » ఛాతీ, మానసిక వైద్యశాలలు సందర్శన



ప్రభుత్వ మానసిక వైద్యశాలలో డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధర్‌ప్రసాద్

పెదవాల్తెరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న నిరుపేదలకు మరింత మెరుగ్గా వైద్యసేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని, రోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధర్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన నగరంలో గల ప్రభుత్వ ఛాతీ వైద్యశాల, మానసిక ఆసుపత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రులను పరిశీలించారు. వార్డుల్లో గల రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలు గురించి వాకబు చేశారు. ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్‌లను పరిశీలించారు. ఓపీని చెక్ చేశారు. ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయా ఆస్పత్రుల పర్యవేక్షకులు, వివిధ విభాగాల వైద్యాధికారులకు తగు సూచనలు, సలహాలను అందించారు. కలెక్టర్ వెంట మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి, హెచ్‌వోడీ డా.డి.విజయలక్ష్మి, పర్యవేక్షణాధికారి తులసీధర్ రెడ్డి, ఛాతీ ఆస్పత్రి ఆర్‌ఎంవో సునీల్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

12వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను నమోదు చేస్తున్న సన్యాసిరావు, టీడీపీ నేతలు

ఆరిలోవ, అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదుపై ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి సభ్యత్వాల సంఖ్యను మరింత పెరిగేలా చూడాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. కూటమి పాలన పట్ల ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. సభ్యత్వం తీసుకునే వారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం పలువురి నుంచి సభ్యత్వాలను స్వీకరించారు. సమావేశంలో టీడీపీ నేతలు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, గాడి సత్యం, బ్రహ్మం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు పునాది మెడ్‌టెక్ జోన్

» విశాఖ ఎంపీ శ్రీభరత్



0.35టీ పీసీఏ ఓపెన్ ఎంఆర్ఐ ప్రొడక్షన్‌ను ప్రారంభించిన శ్రీభరత్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలకు మెడ్‌టెక్ జోన్ పునాదిగా నిలుస్తుందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో గల ట్రైమ్స్ మెడికల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో అత్యాధునిక 0.35టీ పీసీఏ ఓపెన్ ఎంఆర్ఐ ప్రొడక్షన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారతదేశ ఆరోగ్య సంరక్షణ తయారీ రంగానికి అద్భుతమైన అభివృద్ధిలో భాగంగా ఈ సంస్థ ఉత్పత్తిని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. సంస్థ ఉత్పత్తి అయిన 0.35 టీ పీసీఏ ఓపెన్ ఎంఆర్ఐ సిస్టమ్‌ను తయారు చేసిన భారతదేశ మొట్టమొదటి సంస్థగా నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ మిషన్ వల్ల రోగికి తక్కువ ఖర్చుతో సేవలు అందుతాయన్నారు. ఇక్కడ ఇటువంటి యంత్రాలను తయారు చేయడం వల్ల భారతదేశానికి దిగుమతి తగ్గుతుందని, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలకు మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించి నాడు నారా చంద్రబాబు నాయుడు ఇక్కడ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలో అత్యాధునిక మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీని అందించడమే కాకుండా ఆసియా, ఆఫ్రికాలోని పొరుగు దేశాలకు సేవలందించే లక్ష్యంతో ఎగుమతి సామర్థ్యాన్ని పెంచుతామని పేర్కొన్నారు. మెడికల్ డయాగ్నోస్టిక్ ఇమేజింగ్‌లో అగ్రగామిగా ట్రైమ్స్ మెడికల్ మెడ్‌టెక్ జోన్‌లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

జూలో ముగిసిన వర్క్‌షాప్



ఫారెస్ట్ కన్జర్వేషన్ బయాలజిస్టులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అటవీశాఖ సంరక్షణాధికారి దవాన్ మైధీన

ఆరిలోవ అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : జూలో విధులు నిర్వహిస్తున్న బయాలజిస్టులకు వృత్తిపరమైన మరిన్ని మెలకువలు తెలుసుకునేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని అటవీశాఖ సంరక్షణాధికారి బీఎం దవాన్ మైధీన పేర్కొన్నారు. ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో గత మూడు రోజుల నుంచి ఇందిరాగాంధీ జూ పార్కు, సెంట్రల్ జూ అథారిటీ, ఢిల్లీ వారి సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో 15 రాష్ట్రాలకు చెందిన కన్జర్వేషన్ బయాలజిస్టులు పాల్గొన్నారు. జూలో జంతువుల పరిరక్షణ, వాటి ఆరోగ్యం గురించి తెలుసుకోవడం, వారి అనుభవాలు చెప్పడం తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం అందరికీ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో జూ క్యూరేటర్ మంగమ్మ, జూ సిబ్బంది పాల్గొన్నారు.

యువతతోనే పర్యావరణ పరిరక్షణ

» రిటైర్డ్ ప్రొఫెసర్ ఈయూబీ రెడ్డి



మట్టి ప్రమిదలు తయారు చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం యువత కృషి చేయాలని ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని అక్షర పాఠశాలలో శనివారం వ్యూస్ ఎన్జీవో, ఆస్ట్రేలియన్ కాన్సలేట్ జనరల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన యూత్ ఫర్ క్లైమెట్ చేంజ్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులందరూ పర్యావరణహితంగా జీవించాలని సూచించారు. వృక్షాలు ప్రజల ఆస్తిగా భావించి చెట్లను పరిరక్షించుకోవాలన్నారు. కాలుష్య కారకాల వినియోగానికి ఉండి పర్యావరణం పెంచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పండగలు, వేడుకలకు కెమికల్ ఉత్పత్తులు ఎక్కువగా వినియోగించడం పర్యావరణాన్ని దెబ్బ తింటుందన్నారు. కాలుష్యం నివారించి పర్యావరణం పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలన్నారు. భావి తరాలకు ఆరోగ్యకరమైన జీవితం అందించాలంటే శీతోష్ణస్థితి తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రమిదలను పరిశీలించారు.కార్యక్రమంలో గ్రీన్ క్లైమెట్ నిర్వాహకుడు జేవీ రత్నం, వ్యూస్ కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి, అప్పారావు, వెంకట్, రవితేజ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో మేనేజర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న శామ్యూల్ నాగదేసి

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో శనివారం 'మేనేజర్స్ ఇన్ అండ్ ఆఫ్ డిజిటల్ ఎరా' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించగా, రిసోర్స్ పర్సన్‌గా ప్రముఖ చార్టెడ్ అకౌంట్, ఫౌండర్ పార్టనర్ ఆఫ్ శామ్యూల్ నాగదేసి అండ్ అసోసియేట్స్ శామ్యూల్ నాగదేసి ముఖ్యఅతిథిగాపాల్గొని డిజిటల్ యుగంలో మేనేజర్ల పాత్రను, ప్రాముఖ్యతను తెలియపరుస్తూ ప్రస్తుతం మేనేజర్స్, డిజిటల్ టెక్నాలజీ రెండు మిళితమై పని చేయవలసిన అవసరం ఉందన్నారు. డిజిటల్ రివల్యూషన్ అంటే ఇన్ఫర్మేషన్ రెవల్యూషనేనని ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఛార్టిబిటి వంటి నిర్ణయాలు తీసుకోవడం పాత్ర పోషిస్తున్నాయని, అయిన మానవ మేధస్సు ఆర్టిఫిషియల్ మేధస్సు కంటే ఎప్పుడూ గొప్పగానే పనిచేస్తుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక సంస్థలో విజయవంతమైన మేనేజర్‌గా పనిచేయాలంటే మారుతున్న టెక్నాలజీని మానవ అవసరాలకు ఉపయోగపడే విధంగా నేర్చుకోవాలని, మేనేజర్లు చేసే తప్పుడు నిర్ణయాల వలన బ్యాడ్ అకౌంటింగ్ వలన ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు మూతపడిపోయాయని, టెక్నాలజీని వ్యాపారాభివృద్ధికి వాడుకోవాలి గానీ బానిస అవ్వకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

ఏయూ వీసీ హాస్టల్ మెస్‌ల తనిఖీ

» దివ్యాంగ విద్యార్థులకు బ్యాటరీ వాహనం మంజూరు



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆర్ట్స్ సైన్స్ కళాశాల విద్యార్థుల మెస్‌లను ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెస్‌లలో అందిస్తున్న భోజన నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. మెస్‌లకు సరఫరా చేసే కూరగాయలు, నిత్యావసర సరకుల నాణ్యతను సైతం స్టోర్ రూమ్‌కు వెళ్లి తనిఖీ చేశారు. చీఫ్ వార్డెన్లు, సహాయక వార్డెన్లు భోజన నాణ్యతలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రుచికరమైన, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. హాస్టల్ వద్ద దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు అభ్యర్థన మేరకు వీసీ విద్యార్థులకు ఉపయుక్తంగా బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేశారు. త్వరలో దీనిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్‌లు ఎ.పల్లవి, బి.మునిస్వామి, ఎన్.హరనాథ్, కె.రమేష్ బాబు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ వై.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు సభ్యత్వం చేయాలి

» కార్యకర్తలకు ఎమ్మెల్యే వెలగపూడి పిలుపు



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పార్టీ సానుభూతిపరులు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. శనివారం ఎంవీపీకాలనీలోని తన కార్యాలయం వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఓటరు కార్డుతో ఎమ్మెల్యే ఎన్‌రోల్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కంటే రెట్టింపు సభ్యత్వం చేయాలని క్యాడర్‌కు సూచించారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయం లభిస్తోందన్నారు. కార్యకర్తలకు ఉపాధి కోసం శిక్షణ, చదువుకునే విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు వంటికి పార్టీ చేపడుతుందన్నారు. అనంతరం నియోజకవర్గంలో పలు వార్డుల్లో సభ్యత నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చోడే పట్టాభి, కాళ్ల శంకర్, ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, నక్క కనకరాజు, గౌస్ పలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సులు పరిశుభ్రంగా ఉంచాలి

» అద్దె బస్సుల యజమానులతో ఆర్టీసీ విశాఖ రీజియన్ ఇన్‌చార్జి మేనేజర్ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అద్దె బస్సులు పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ ఇన్‌చార్జి మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సులో శనివారం ఆయన అద్దెబస్సుల యజమానులతో సమావేశమయ్యారు. బస్సుల నిర్వహణ సరిగాలేదని, అపరిశుభ్రంగా ఉంటున్నాయని, షెడ్యూల్ సమయం ప్రకారం బస్సులు నడవడం లేదంటూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వాటిని సరిదిద్దుకోవలసిన అవసరం ఉందన్నారు. అద్దె బస్సుల యజమానులు తమ డ్రైవర్లకు ఆర్టీసీ నియమాలు, నిబంధనలు తెలియజేయాలని అన్నారు. ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియోను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అద్దె బస్సుల యజమానులు తమ సమస్యలు వివరించగా, నిబంధనల మేరకు వాటిని పరిష్కరిస్తామన్నారు. అద్దె బస్సుల డ్రైవర్లకు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలని, వాటిని సకాలంలో చెల్లించాలని సూచించారు. డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ జి సత్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏయూ విద్యా విభాగం స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్, తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. దీనిలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచటం ద్వారా ఆరోగ్యం, ఏయూ క్యాంపస్ ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఇందులో విద్యార్థులు, ఉద్యోగులు, ఆచార్యులు అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. విద్యావిభాగాధిపతి టి.షారోన్‌రాజు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు స్ఫూర్తినిచ్చారన్నారు.

ఏడాకుల చెట్లు తొలగించండి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారుల పక్కన నాటిన ఏడాకుల చెట్లను తొలగించాలని జీవీఎంసీ కమిషనర్‌కు సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు కమిషనరుకు వినతిపత్రం అందజేశారు. ఏడాకుల చెట్ల నుంచి విడుదలయ్యే వాయువు వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటులో వైసీపీ నేతల దందా

» జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో బాణసంచా దుకాణాల ఏర్పాటులో వైసీపీ నేతలు దందా చేస్తున్నారని జనసేన పార్టీ నాయకుడు, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శనివారం ఆయన మేఘాలయ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల ఏర్పాటుకు మైదానం లీజు నుంచి దుకాణాలకు అనుమతులు, సామగ్రి విక్రయం వరకూ అన్నీ వైసీపీ నేతలే దగ్గరుండి చూస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది దుకాణాల ఏర్పాటులో వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వయంగా తన చాంబర్‌లో సెటిల్‌మెంట్ చేయడం దీనికి నిదర్శనమని తెలిపారు. తాము సూచించిన వ్యాపారులకు కాకుండా ఇతరులకు అనుమతులు ఇవ్వకుండా జీవీఎంసీ అధికారులను డిప్యూటీ మేయర్ ఇబ్బంది పెట్టారని చెప్పారు. తర్వాత వ్యాపారులను తన చాంబర్‌కు పిలిచి బెదిరించి బలవంతంగా దుకాణాలు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. దీనిపై బాధితుడు మట్టపర్తి రామచంద్రరావు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వైసీపీ అధికారంలో ఉండడంతో కేసు నమోదు చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కూటమి అధికారంలోకి రావడంతో బాధితుడు సీపీకి ఫిర్యాదు చేయడంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీధర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారన్నారు.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిత

కంచరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డిగ్రీల కంటే నైపుణ్యం ఉంటేనే ఉజ్వల భవిత సిద్ధిస్తుందని విశాఖ పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో శనివారం ప్రతిభావంతులకు ధ్రువ పత్రాలు అందజేసే కార్యక్రమానికి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుతో కలిసి శ్రీభరత్ హాజరయ్యారు. ఎన్ని డిగ్రీలు ఉన్నాయన్నది ముఖ్యంకాదని, ఎంత నైపుణ్యం సంపాదించామన్నదే లక్ష్యంగా యువత కృషిచేయాలని పిలుపునిచ్చారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ప్రతిభ చూపడంతో ఆరుగురు విద్యార్థులు న్యూఢిల్లీలోని కౌశల్ భవనంలో సత్కారానికి ఆహ్వానం పొందడం అభినందనీయమన్నారు. ఇక్కడ ఐటీఐలో వెయ్యి మంది విద్యార్థులు 20 ప్రధాన ట్రేడుల్లో శిక్షణ పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. ఐటీఐలు నైపుణ్యలేమిని తగ్గించి యువత విజయం సాధించేలా తయారు చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందజేశారు. టీడీపీ నాయకుడు గండి బాబ్జీ, బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిషిత్‌కు టెన్నిస్ చాంపియన్ టైటిల్



నిషిత్‌తో కోచ్ బాలకృష్ణ

విశాఖపట్నం స్పోర్ట్సు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐటీఎఫ్ వరల్డ్ టూర్ ఆఫ్ జూనియర్ టెన్నిస్ టోర్నీలో నగరానికి చెందిన నిషిత్ ఆరిమిల్లి చాంపియన్ టైటిల్ ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. శనివారం ఇథోపియా, ఆడిస్ అబాబాలో జరిగిన ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన వరల్డ్ 513 ర్యాంకర్ ఈజిష్నపై అద్భుత ఆటతీరును ప్రదర్శించి 6-2, 7-6 వరుస సెట్‌లలో గెలుపొంది చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకుని వరల్డ్‌లో తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకున్నాడు. ఈ సందర్భంగా సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లు నిషిత్‌తోపాటు ట్రైనర్‌గా వ్యవహరించిన బాలకృష్ణను అభినందించారు.

సేవాభావం అలవరచుకోండి

» విద్యార్థులకు డీఆర్‌ఎం సూచన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, చిత్రంలో ప్రిన్సిపాల్ కమల్‌జిత్

అక్కయ్యపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సేవాభావం, మానవత్వపు విలువలు వంటి ఉత్తమ గుణాలను భావిభారత పౌరులలో పెంపొందించే కార్యక్రమమే స్కౌట్, గైడ్ శిబిరాల నిర్వహణ ఉద్దేశమని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం స్కౌట్, గైడ్స్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కలిసి మెలిసి మెలిగే స్వభావాన్ని విద్యార్థులు నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రిన్సిపాల్ కమల్‌జిత్ మాట్లాడుతూ శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన 25 పాఠశాలల నుంచి 178 మంది విద్యార్థులు, 25 మంది ఎస్కార్ట్ టీచర్లు పాల్గొన్నారన్నారు. వీరందరికీ క్రమశిక్షణతో కూడిన నైపుణ్యంపై తర్ఫీదు ఇస్తూ ప్రథమ చికిత్సపై అవగాహన, ఫైర్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శిబిరం నాయకుడు రమేష్‌బాబు, జగన్మోహనరావు, ప్రధానోపాధ్యాయిని వి.ఎం.శైలజ, ఉపాధ్యాయినులు విజయలక్ష్మి, సబ్రిన్, పూజ తదతరులు పాల్గొన్నారు.

1383 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు



తనిఖీలు చేస్తున్న అధికారులు

మురళీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డు భద్రత, వాహన ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టినట్టు రవాణా శాఖ ఉప కమిషనర్ జి.ఆదినారాయణ అన్నారు. శనివారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 26 వరకు జరిపిన పలు దాడుల్లో 5,104 వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 1,383మంది డ్రైవింగ్ లైసెన్సులు తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు రోడ్డు భద్రత పాటించాలని సూచించారు. బైక్ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న ప్రయాణికుడు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. లేకుంటే కేసులు విధించేలా కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన విషయం డ్రైవింగ్ చేసే వారు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఆర్టీఏ విశాఖపట్నం ఉపప్రాంతీయ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

ఇక్కడ ఆక్రమణలకు అడ్డులేదు



ఆశవానిపాలెంలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

కంచరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జా చేయడమే పనిగా పెట్టుకున్నారు చాలామంది. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా పలుకుబడి వర్గాల వారి నుంచి సాధారణ ప్రజానీకం వరకు, నగరం, గ్రామం అనే తేడా లేకుండా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. కళ్లముందే ఈ తతంగం కనిపిస్తున్నా బాధ్యులెవరూ కట్టడి చేయడం లేదు. జీవీఎంసీ 57వ వార్డు పరిధి ఆశవానిపాలెంలోని ప్రధాన మార్గంలో చిల్లర వర్తకులు ఇష్టానుసారం దుకాణాలు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. మెయిన్ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లడానికి స్థానిక దుర్గాలమ్మ గుడి నుంచి రోడ్డు ఉంది. అసలే ఇరుకుమార్గం, దీనికితోడు వరుసగా బడ్డీలు, దుకాణాల ఏర్పాటు పేరిట స్థానికులు రోడ్డును ఆక్రమించుకున్నారు. గ్రామంలోకి వెళ్లాలంటే స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. సాయంత్రం కాగానే పలువురు ఈ దుకాణాల్లో బెల్ట్‌షాపులు కూడా నిర్వహిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. చీకటిపడగానే పలువురు మద్యం తాగి, ధూమపానం చేస్తూ, మార్గం గుండా వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారని పలువురు వాపోతున్నారు. తక్షణమే జీవీఎంపీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. చీకటిపడగానే యథేచ్ఛగా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

శివాలయం అభివృద్ధికి దాతల చేయూత



దేవాలయ ప్రాంగణంలో చేపడుతున్న పనులు

మురళీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి); సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఉప ఆలయాలైన మాధవధార క్షేత్రంలోని శ్రీభ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి దేవాలయంలో దాతల సాయంతో విస్తరణ పనులు చేపడుతున్నారు. ఆలయం ఎదుట ఈశాన్యం వైపుగా వాకిలి పెంచి కట్టడాలు చేపడుతున్నారు. ఈ మేరకు దేవస్థానం భూమిలోనే కొండపై ఉన్న ఆలయాన్ని సుమారుగా మరో 80 గజాల వైశాల్యం పెంచి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇరుకుగా మారడంతో పూజా స్థలాన్ని విస్తరిస్తూ పనులు చేపడుతున్నారు. భక్తులకు సౌకర్యాలను కల్పిస్తూ దాతల ముందు ఉంచిన ప్రతిపాదనకు సాయం అందడంతో ఈ పనుల్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ తెలిపారు. మరో వారంలో వచ్చే కార్తీక మాసం నాటికి పనులు పూర్తి చేసి శివారాధనకు కొండకు వచ్చే భక్తులకు ఉపయుక్తంగా వసతులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సింహాచలం దేవస్థానం అధికారుల అనుమతి కోరిన మీదట పనులు చేపడుతున్నట్లు వివరించారు. సుమారు వందేళ్ల చరిత్ర గల మాధవధార కొండపై ఉన్న ఈ శివాలయానికి కార్తీకమాసంలో భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ప్రతిరోజు దర్శనాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో మాధవధార పుణ్యక్షేత్రం కార్తీకశోభతో వెలుగొందుతుంది. అక్కడ కనీస వసతులు కల్పిస్తుండడం, ఆలయాన్ని విస్తరిస్తుండడంతో భవిష్యత్‌లో సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రేమ్‌కుమార్



కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్‌కు మొక్క అందిస్తున్న డీఈవో

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా ఎన్.ప్రేమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ బదిలీపై విశాఖ వచ్చారు. సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్న ప్రేమ్‌కుమార్‌కు రెండు కార్యాలయాల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీసు బ్యారెక్స్‌లో ఓపెన్ హౌస్

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు బ్యారెక్స్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు అధికారులు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈస్ట్ ఏసీపీ లక్ష్మణ్‌మూర్తి మాట్లాడుతూ పోలీసు శాఖ విధివిధానాలను విద్యార్థులకు వివరించారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనండి: ఎంపీ



మొబైల్‌లో టీడీపీ సభ్యత్వ యాప్‌ను చూపుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్సీ దువ్వారపు, గండి బాబ్జీ, ఇతర నాయకులు

మాధవధార, కంచరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొనాలని ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. శనివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 48, 49 వార్డులు బర్మాక్యాంప్, ఏఎస్ఆర్ నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ శ్రేణులంతా పార్టీ పటిష్ట నిర్మాణానికి రాజీలేకుండా పాటుపడాలని సూచించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనతో అధోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర పోరాటం చేస్తున్నారన్నారు. ప్రతి వార్డులోను, గ్రామంలోనూ పార్టీ సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు ఉల్లాసంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, నాయకులు పి.శ్రీను, వెల్లంకి భరత్, మురళీ, వాసు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ దక్షిణలో.. టీడీపీ సభ్యత్వ నమోదు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గం 37వ వార్డు చినజాలారిపేటలో శనివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. విశాఖ దక్షిణ ఇన్‌చార్జి శీతంరాజు సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, తెలుగు యువత అధ్యక్షుడు వలిశెట్టి తాతాజీ, వార్డు అధ్యక్షుడు కోనాడ చిన్ని, బంగారు రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు



విద్యార్థులతో సినీనటుడు అంకిత్ కొయ్యా సందడి

జ్ఞానాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎక్సెల్సియర్ యువజనోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. రెండో రోజు 80 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పాశ్చాత్య, దేశీయ నృత్యాలు, మూకాభినయం, లఘుహాస్య నాటికలు, ఫోటోగ్రఫీ ప్రదర్శనతో అకట్టుకున్నారు. ముగింపు ఉత్సవాలకు వర్ధమాన సినీనటుడు అంకిత్ కొయ్యా విశిష్ట అతిథిగా విచ్చేసి విద్యార్థులతో కలసి సందడి చేశారు. ఆడి పాడారు. విద్యార్థులతో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. ముఖ్యఅతిథిగా క్రాఫ్ట్ బేకింగ్ యూనిట్ వ్యాపారవేత్త కె.నిరుపమ విచ్చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.షైజీ, పీకే జయలక్ష్మి, ఎక్సెల్సియార్ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కరసుధ, కమిటీ ప్రతినిధులు డా.హరిణి, పావని, ప్రమీల, వీణ, సోనీ, డా.రమణీలత తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో బాధ్యతల స్వీకారం



భవానీశంకర్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా బీహెచ్ భవానీశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఆర్వోగా ఉన్న మోహన్‌కుమార్‌ను చిత్తూరు బదిలీ చేసి ప్రభుత్వం..ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న భవానీశంకర్‌ను నియమించింది. కొత్తగా విధుల్లో చేరిన భవానీశంకర్‌ను కలెక్టరేట్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా బాధ్యతలు తీసుకున్న భవానీశంకర్ మర్యాదపూర్వకంగా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిశారు.

ఇబ్బందులు తొలగిస్తా: వంశీకృష్ణ



ప్రజల సమస్యలు వింటున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. అపరిష్కృత సమస్యలను పరిశీలించారు. ప్రజలతో సంభాషించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నమోదు చేసుకున్నారు. గొల్లలపాలెం అంగన్వాడీ కేంద్రం భవనం వేరొక చోట ఏర్పాటు చేయాలని, ఆర్‌టీ క్లబ్ మొదటి అంతస్తు స్లాబ్ నిర్మాణం, లలితా కాలనీ పార్కులో సమస్యలు, రజక వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ ఆవశ్యకతను పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల ఇబ్బందులు తొలగించేలా ప్రతి పనిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కలిసిన ప్రతినిధులు

సీతమ్మధార, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంక దినకర్, అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డు సభ్యుడు వెంగమాంబ శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, పి.మురళి, మహేశ్వరరాజు, కాంట్రాక్టర్ శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. పేదరిక నిర్మూలన, రైతులకు మద్దతు, కార్మిక సంక్షేమం, ఆహార భద్రత, అందరికీ ఇళ్లు, పరిశుభ్రమైన తాగునీరు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.

మాజీ ఎమ్మెల్యే దేముడుకు సీపీఐ ఘన నివాళి

అల్లిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హృదయాల్లో నిజమైన దేముడు చింతపల్లి మాజీ శాసనసభ్యుడు గొడ్డేటి దేముడని సీపీఐ విశాఖ జిల్లా సమితి శ్లాఘించింది. దేముడు 9వ వర్థంతి సందర్భంగా శనివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, చింతపల్లి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన పార్టీకి ఎనలేని సేవ చేశారన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జీఎస్ జే అచ్యుతరావు, ఎస్‌కె రెహమాన్, జి.కాసులరెడ్డి, నూనెల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లి, చెల్లిపై కేసులు పెట్టేవాడు నాయకుడా?



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్

సీతంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్‌ఎస్‌ఎల్‌టీలో ఫిర్యాదు చేసిన విధానం ఏరు దాటక ముందు ఓడ మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న చందంగా ఉందని, తన సొంత తల్లి, చెల్లిని కోర్టుకు లాగిన ఆయన ప్రజలకు ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నారని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇంచార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ ప్రశ్నించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోడికత్తి శ్రీను కేసులో ఒక్కసారైనా కోర్టుకు రాని జగన్, బ్యాచ్‌మేట్ కోసం అద్దె హెలికాప్టర్‌లో జైలుకు వెళ్లి పరామర్శించారని ఎద్దేవా చేశారు. ఇంట్లోనే ముగ్గురి ఆడబిడ్డలను మోసం చేసిన మీరు మూడు కోట్ల మహిళలకు ఏ రకంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తన విజయానికి కృషి చేసిన షర్మిలపై కేసులు వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉత్తరాంధ్ర రీజినల్ మహిళా కో-ఆర్డినేటర్లు నాగలక్ష్మి, త్రివేణి, అమరాపు దుర్గ, జనసేన 15వ వార్డు అధ్యక్షులు యడ్ల కళ, గారపాటి లక్ష్మి, పద్మ, 27వ వార్డు జనసేన అధ్యక్షులు సురేష్‌బాబు, 34వ వార్డు ఇంచార్జ్ నారా నాగేశ్వరరావు, కోసూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి పుడితే ఆమడదూరం!

... 5వ పేజీ తరువాయి

నమోదైన 20 కేసుల్లో కొత్తగా వివాహమైనవారు ఐదుగురు ఉన్నారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టిందని మరో పది మంది వరకు, మూడో కాన్పులోనూ ఆడ పిల్ల పుట్టడంతో మరో ఇద్దరు ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరైతే మూడోసారి గర్భం వచ్చినప్పుడు ముందుగానే పరీక్ష చేయించి ఆడ పిల్ల పుడుతుందని చెప్పారంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటువంటి వేధింపులు భరించలేక బాధితులు డీవీ సెల్‌తోపాటు పెద్దల దృష్టికి తీసుకువెళుతున్నారు.

విడాకులు ఇచ్చేయాలని..

అమ్మాయి పుట్టిందని భార్యను పూర్తిగా విడిచిపెట్టేందుకు కొంతమంది సిద్ధపడుతున్నారు. ఇందులో కుటుంబ సభ్యుల ప్రమేయం కూడా ఉంటోంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ల మాటలు విని ఎంతోమంది భర్తలు విడాకులు నిర్ణయాన్ని తీసుకుంటున్నారు. ప్రసవానికని పుట్టింటి వద్ద దించి వస్తున్న వాళ్లు..ఆ తరువాత ఆడపిల్ల పుడితే అటు వైపు చూడడం లేదు. అమ్మాయి పుట్టింది కాబట్టి తనకు విడాకులు ఇచ్చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. స్థానికంగా పెద్దల సమక్షంలో పంచాయితీలు పెడుతున్నారని, వారు చెప్పినా వినిపించుకోకపోవడంతో తమ వరకు ఫిర్యాదులు వస్తున్నట్టు డీవీ సెల్ అధికారులు చెబుతున్నారు.

వైకల్యంతో పుట్టినా ఇబ్బందే..

పిల్లలు వైకల్యంతో పుట్టినా కొందరు తల్లిపై నెపాన్ని నెట్టేస్తున్నారు. డౌన్ సిండ్రోమ్, మానసిక సమస్యలు, చేతులు, కాళ్లలో వైకల్యంతో పిల్లలు పుట్టినా వదిలేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాదిలో ఇటువంటి కేసులు ఐదు వరకు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. పుట్టిన పిల్లల అవకరాలకు భార్యను బాధ్యులను చేసి విడాకులు ఇచ్చేందుకు సిద్ధపడడం అత్యంత దారుణమైన విషయమని డీవీ సెల్ అధికారులు పేర్కొంటున్నారు. ఆయా కేసులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, అయితే పరిష్కారం పెద్దగా లభించడం లేదని వాపోతున్నారు. తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా పురుషులు విడాకులు అన్న మాటను పట్టుకుని ఉంటున్నారని, కొందరు మెత్తబడినా కుటుంబ సభ్యులు అందుకు అంగీకరించడం లేదని చెబుతున్నారు. దీనివల్ల కోర్టుల వరకు కేసులు వెళుతున్నట్టు చెబుతున్నారు. కొన్ని ఇప్పటికీ కౌన్సెలింగ్ దశలో ఉన్నాయంటున్నారు.

కారణం తండ్రే..

ఆడ పిల్ల, మగ పిల్లాడు ఎవరు పుట్టినా దానికి పురుషుడి క్రోమోజోములే కారణం. కానీ, ఈ విషయం తెలియక చాలామంది తల్లిని బాధ్యులుగా చూసి వేధింపులకు గురిచేస్తుంటారు. మహిళలో ఎక్స్‌ఎక్స్ క్రోమోజోమ్స్ ఉంటాయి. పురుషుల్లో ఎక్స్, వై క్రోమోజోమ్స్ ఉంటాయి. మహిళలో ఉండే ఎక్స్ క్రోమోజోమ్‌తో పురుషుడిలో ఉండే ఎక్స్ క్రోమోజోమ్ కలిస్తే ఆడ పిల్ల, వై క్రోమోజోమ్ కలిస్తే మగబిడ్డ పుడతారు. కానీ, ఈ విషయం తెలియక ఎంతోమంది పురుషులు ఆడ పిల్ల పుట్టడానికి తల్లిని బాధ్యురాలిని చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

లింగ వివక్ష నేరం

లింగ వివక్ష చూపించడం నేరం. ఇటువంటి వివక్ష చూపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. ఆడ పిల్ల పుట్టడానికి తల్లి కారణం కాదు. పురుషుడి క్రోమోజోమ్స్ వల్లే ఆడ పిల్లగానీ, మగపిల్లాడు గానీ పుడతాడు. దీనికి తల్లిని బాధ్యురాలిని చేయడం తప్పు. పిల్లలు పుట్టక ఎంతోమంది తల్లిదండ్రులు మథనపడుతున్నారు. ఈ మధ్యకాలంలో సంతాన లేమి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆడ, మగ అంటూ లింగ వివక్ష చూపించడం సమంజసం కాదు. అబ్బాయిలకు ఎందులోనూ తీసిపోని విధంగా అమ్మాయిలు రాణిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అబ్బాయిలు కంటే అమ్మాయిలే అనేక రంగాల్లో ముందంజలో ఉన్నారు. ఈ విషయంలో అపోహలు వీడి ఎవరు పుట్టినా అపురూపంగా చూసుకోవాలి. ఎందరికో ఉన్న సమస్య మీకు లేనందుకు ఆనందంగా ఉండాలి. **- డాక్టర్ టి.పద్మావతి, విశ్రాంత గైనకాలజిస్టు, కేజీహెచ్**

3 ఇసుక డిపోలు

... 5వ పేజీ తరువాయి

టెండర్లు పిలిచి తక్కువ మొత్తం కోట్ చేసిన సంస్థలకు స్టాకు పాయింట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. దీనికి సంబంధించి విధివిధానాలు రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం జారీచేయనున్నది.

ఒడిశా ఇసుకపై విజిలెన్స్: విశాఖ నగరానికి ఒడిశా నుంచి ఇసుక వస్తుండడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. గనులు, రెవెన్యూ, పోలీస్, రవాణా, పంచాయతీ రాజ్, జల వనరుల శాఖ అధికారులు, సిబ్బందితో కూడిన విజిలెన్స్ బృందం మూడు రోజుల క్రితం నగర శివారులో ఒక లారీని పట్టుకుని రూ.30 వేల జరిమానా విధించారు.

రూ.67కు కిలో కంది పప్పు

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అక్టోబరు నెలకు జిల్లా డిమాండ్‌లో 20 నుంచి 30 శాతం కందిపప్పు కేటాయించినా, గోదాములకు అంతకంటే తక్కువ వచ్చింది. రెండో వారం నాటికి మరికొంత సరఫరా చేశారు. అయితే నవంబరు నుంచి పూర్తిస్థాయిలో కందిపప్పు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీతో పౌర సరఫరాల సంస్థలో చలనం వచ్చి మిల్లర్ల నుంచి కొనుగోలు చేసి మరీ జిల్లాలకు సరఫరా చేశారు. దీంతో కార్డుదారులందరికీ కందిపప్పు, పంచదార అందిస్తామని డీలర్లు చెబుతున్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.180 వరకు ఉండగా కార్డుదారులకు రూ.67కు అందించనున్నారు. దీనికితోడు దీపావళి నుంచి ఉచిత సిలిండర్ పథకం ప్రారంభం కానున్నది. సోమవారం దీనికి సంబంధించి పూర్తి విధి విధానాలు రానున్నాయి.

'నిబంధనల ప్రకారం సేవలందించకపోతే చర్యలు'

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు అనుగుణంగా ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నెట్వర్కు ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స అందించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ యాజమాన్యాలను హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్య సేవలపై వచ్చిన ఫఫిర్యాదులను వివరించారు. పలు ఆసుపత్రులపై వచ్చిన ఫిర్యాదులను వివరించి జరిమానా విధించారు. సమావేశంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ

జ్ఞానాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ హరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, శ్రీ కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 7 వరకు మండల కాల మహా అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కంచుమూర్తి వెంకటరమణ మూర్తి తెలిపారు. వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలధారణ చేసిన ప్రతి భక్తునికి మండలకాలం పాటు ఈ అన్నప్రసాద వితరణ చేస్తామని, ఏవరైనా దాతలు భక్తిభావంతో వస్తు, ధన రూపేణా ట్రస్ట్ పేరుతో సహాయం అందించి రసీదు పొందవచ్చన్నారు. దీక్షాధారులు ఇక్కడకు వచ్చి భిక్ష తీసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు కడగల శ్రీను, కె.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, సభ్యులు కోరాడ అప్పారావు, రామకృష్ణారెడ్డి, పి.అవతార్ స్వామి, అయ్యప్ప భక్తులు పలువురు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

20వ వార్డులో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు స్వీకరిస్తున్న పోతన్నరెడ్డి తదితరులు

పెదవాల్తేరు, అక్టోబరు 26 : తెలుగుదేశం పార్టీ 2024-26కు సంబంధించిన సభ్యత్వ నమోదును ఆ పార్టీ 20వ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం చినవాల్తేరు, రజిక వీధి, కొయ్యవీధి తదితర ప్రాంతాల్లో సభ్యత్వాలను నమోదు చేశారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు పోతన్నరెడ్డి తెలిపారు. ఈ సభ్యత్వాన్ని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూర్తి యాదవ్, మదీన్, మురళి, దేవుడుబాబు, సీతన్న, వినయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో రెండు నెలల చిన్నారికి శస్త్రచికిత్స



వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించిన చిన్నారి

ఆరిలోవ, అక్టోబరు 1 : (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని బరంపురం సమీపం గొల్లబం గ్రామానికి చెందిన నెలల చిన్నారికి శనివారం ఉదయం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గొల్లబం గ్రామానికి చెందిన యశోద, బాలరాజు దంపతులకు పుట్టిన రెండు నెలల చిన్నారికి కళ్లలో మచ్చలు ఏర్పడడంతో సరిగా కనిపించలేదు. దీంతో ఆ దంపతులు ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిని సంప్రదించగా, వైద్యులు తమ ప్రయత్నంలో భాగంగా శస్త్రచికిత్స నిర్వహించి చూపు రప్పించారు. తమ బిడ్డకు చూపు ప్రసాదించిన వైద్యులకు యశోదబాలరాజు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

● వీనమ్ : మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం),శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● పొట్టేల్ : వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● ఎంతపనిచేసావ్ చంటి : వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● లగ్గం : విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)

● దేవర :జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● వేట్టయాన్ : సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)

● విశ్వం : శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● జనక అయితే గనక : శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 50, క్యాబేజీ 28, క్యారెట్ 54 దొండకాయలు 36, బంగాళ దుంపలు 31, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)60, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 30, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

శ్మశానంలో సమస్యల ఘోష

- పెదజాలారిపేట శ్మశాన వాటికలో కనీస సదుపాయల కరువు
- వసతుల కల్పనపై చిన్నచూపు
- అంతిమ సంస్కారాల సమయంలో మృతుల బంధువుల ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పెదజాలారిపేటలో శ్మశనవాటిక



ఏడాది పొడవునా తాళం వేసి ఉండడంతో నిరుపయోగంగా మారిన భవనం

పెదవాల్తేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలోని శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు కల్పనపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర పాలక అభివృద్ధి సంస్థ శ్మశాన వాటికల నిర్వహణను పూర్తిగా విస్మరిస్తోందని పలువురు మండిపడుతున్నారు. వాస్తవానికి మతం, కులం వంటి బేధాలు లేకుండా అందరికీ శ్మశాన వాటికల అవసరం ఉంటుంది. కానీ ఎందుకో శ్మశానం అనగానే ఇటు ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పలు శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు లేని పరిస్థితి. దీంతో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో మృతుల బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జీవీఎంసీ 19వ వార్డులో పెదజాలారిపేట వాల్తేరు డిపో సముద్ర తీరానికి అనుకుని శ్మశానవాటిక ఉంది. ఈ శ్మశాన వాటికకు జీవీఎంసీ 19, 20, 21వ వార్డులకు సంబంధించి ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల నిర్వహణకు ఇక్కడకు తీసుకువస్తారు. అయితే అంత్యక్రియలు చేపట్టే సమయంలో అవసరమయ్యే ఏ మాత్రం వసతులు లేవు. దీంతో మృతుల కుటుంబీకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటుంటారు. నీరు ఏర్పాటు చేసుకోవడం, కట్టెలు వెంట తెచ్చుకోవడం వంటివి చేస్తుంటారు. అయితే ఇది ఆర్థికంగా భరించే వారు మాత్రం చేసుకోగలుగుతున్నారు. పేద, దిగువ మధ్య తరగతి వారు, పెద్దగా బంధువులు లేని వారికి ఇది ఇబ్బందిగానే ఉంటుంది. ఈ శ్మశాన వాటికలో సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

ఈ శ్మశానవాటిక నిర్వహణ లేక పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. ప్రహరీ, గేటు వంటివి లేకపోవడంతో రాత్రయితే చాలు మందుబాబులు చేరుతుంటారు. మత్తు పదార్థాలు తీసుకునే వారూ ఇక్కడే తిష్ట వేస్తుంటారు. వీరి ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. దీంతో ఇటు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. కాటి కాపరి కూడా లేకపోవడంతో ఆకతాయిలను అడ్డుకునే వారే లేకుండా పోతున్నారు. అంతిమ సంస్కారాలకు వచ్చే వారి నుంచి పూడ్చడానికైనా 6,500, దహనానికి రూ.8 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యుడు, బంధువో మృతి చెందిన పుట్టెడు దుఃఖంలో ఉన్న వారు ఆ సమయంలో బేరసారాలు చేయలేక, నిలదీయ లేక వారు అడిగిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. పేదలకు ఇది భారంగానే ఉంటోంది.

మరణ ధ్రువపత్రాలకు తప్పని ఇబ్బందులు

ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని పథకాలు, బీమా వంటివి పొందాలంటే మరణ ధ్రువీకరణ పత్రం అవసరం. ఈ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించిన వారికి ఈ ధ్రువపత్రం పొందడం కూడా కష్టంగా మారింది. మృతి చెందినవ్యక్తి వివరాలు నమోదు చేయడానికి ఇక్కడ ఎవరూ ఉండడం లేదు.అప్పుడు ఉన్న పరిస్థితుల్లో అంతిమ సంస్కారాలు కానిచ్చి వెళ్లిపోతున్నారు. ఆ తర్వాత మరణ ధ్రువపత్రం కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

ఆ భవనం ఎందుకో మరి?

గతంలో శ్మశన వాటిక అవరణలో ఓ భవనాన్ని నిర్మించారు. దీన్ని ఎందుకు నిర్మించారో తెలియదు. పోనీ దాన్ని ప్రారంభించి కాటికాపరిని నియమించి వినియోగించుకోవాలనే చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఆ భవనం అందుబాటులోకి తెస్తే కనీసం వర్షాల సమయంలో అక్కడ ఉండే అవకాశమైనా ఉంటుంది.

ఈ శ్మశాన వాటికలో కనీస వసతులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృషి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగులకు మెరుగ్గా వైద్య సేవలు అందించాలి

- వైద్యులతో కలెక్టర్ హరేంధర్‌ప్రసాద్
- ఛాతీ, మానసిక వైద్యశాలలు సందర్శన



ప్రభుత్వ మానసిక వైద్యశాలలో డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధర్‌ప్రసాద్

పెదవాల్తెరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న నిరుపేదలకు మరింత మెరుగ్గా వైద్యసేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని, రోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధర్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన నగరంలో గల ప్రభుత్వ ఛాతీ వైద్యశాల, మానసిక ఆసుపత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రులను పరిశీలించారు. వార్డుల్లో గల రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలు గురించి వాకబు చేశారు. ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్‌లను పరిశీలించారు. ఓపీని చెక్ చేశారు. ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయా ఆస్పత్రుల పర్యవేక్షకులు, వివిధ విభాగాల వైద్యాధికారులకు తగు సూచనలు, సలహాలను అందించారు. కలెక్టర్ వెంట మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి, హెచ్‌వోడీ డా.డి.విజయలక్ష్మి, పర్యవేక్షణాధికారి తులసీధర్ రెడ్డి, ఛాతీ ఆస్పత్రి ఆర్‌ఎంవో సునీల్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు పునాది మెడ్‌టెక్ జోన్

- విశాఖ ఎంపీ శ్రీభరత్



0.35టీ పీసీపీ ఓపెన్ ఎంఆర్‌ఐ ప్రొడక్షన్‌ను ప్రారంభించిన శ్రీభరత్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలకు మెడ్‌టెక్ జోన్ పునాదిగా నిలుస్తుందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో గల ట్రైమ్స్ మెడికల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో అత్యాధునిక 0.35టీ పీసీపీ ఓపెన్ ఎంఆర్‌ఐ ప్రొడక్షన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారతదేశ ఆరోగ్య సంరక్షణ తయారీ రంగానికి అద్భుతమైన అభివృద్ధిలో భాగంగా ఈ సంస్థ ఉత్పత్తిని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. సంస్థ ఉత్పత్తి అయిన 0.35 టీ పీసీపీ ఓపెన్ ఎంఆర్‌ఐ సిస్టమ్‌ను తయారు చేసిన భారతదేశ మొట్టమొదటి సంస్థగా నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ మిషన్ వల్ల రోగికి తక్కువ ఖర్చుతో సేవలు అందుతాయన్నారు. ఇక్కడ ఇటువంటి యంత్రాలను తయారు చేయడం వల్ల భారతదేశానికి దిగుమతి తగ్గుతుందని, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలకు మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించి నాడు నారా చంద్రబాబు నాయుడు ఇక్కడ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలో అత్యాధునిక మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీని అందించడమే కాకుండా ఆసియా, ఆఫ్రికాలోని పొరుగు దేశాలకు సేవలందించే లక్ష్యంతో ఎగుమతి సామర్థ్యాన్ని పెంచుతామని పేర్కొన్నారు. మెడికల్ డయాగ్నోస్టిక్ ఇమేజింగ్‌లో అగ్రగామిగా ట్రైమ్స్ మెడికల్ మెడ్‌టెక్ జోన్‌లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే పర్యావరణ పరిరక్షణ

- రిటైర్డ్ ప్రొఫెసర్ ఈయూబీ రెడ్డి



మట్టి ప్రమిదలు తయారు చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం యువత కృషి చేయాలని ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని అక్షర పాఠశాలలో శనివారం వ్యాస్ ఎన్జీవో, ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన యూత్ ఫర్ క్లైమెట్ ఛేంజ్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులందరూ పర్యావరణహితంగా జీవించాలని సూచించారు. వృక్షాలు ప్రజల ఆస్తిగా భావించి చెట్లను పరిరక్షించుకోవాలన్నారు. కాలుష్య కారకాల వినియోగానికి ఉండి పర్యావరణం పెంచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పండగలు, వేడుకలకు కెమికల్ ఉత్పత్తులు ఎక్కువగా వినియోగించడం పర్యావరణాన్ని దెబ్బ తింటుందన్నారు. కాలుష్యం నివారించి పర్యావరణం పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలన్నారు. భావి తరాలకు ఆరోగ్యకరమైన జీవితం అందించాలంటే శీతోష్ణస్థితి తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రమిదలను పరిశీలించారు.కార్యక్రమంలో గ్రీన్ క్లైమెట్ నిర్వాహకుడు జేవీ రత్నం, వ్యాస్ కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి, అప్పారావు, వెంకట్, రవితేజ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఏయూ వీసీ హాస్టల్ మెస్‌ల తనిఖీ

- దివ్యాంగ విద్యార్థులకు బ్యాటరీ వాహనం మంజూరు



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆర్ట్స్ సైన్స్ కళాశాల విద్యార్థుల మెస్‌లను ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెస్‌లలో అందిస్తున్న భోజన నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. మెస్‌లకు సరఫరా చేసే కూరగాయలు, నిత్యావసర సరకుల నాణ్యతను సైతం స్టోర్ రూమ్‌కు వెళ్లి తనిఖీ చేశారు. చీఫ్ వార్డెన్లు, సహాయక వార్డెన్లు భోజన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రుచికరమైన, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. హాస్టల్ వద్ద దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు అభ్యర్థన మేరకు వీసీ విద్యార్థులకు ఉపయుక్తంగా బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేశారు. త్వరలో దీనిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్‌లు ఎ.పల్లవి, బి.మునిస్వామి, ఎన్.హరనాథ్, కె.రమేష్ బాబు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ వై.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను నమోదు చేస్తున్న సన్యాసిరావు, టీడీపీ నేతలు

ఆరిలోవ, అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదుపై ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి సభ్యత్వాల సంఖ్యను మరింత పెరిగేలా చూడాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. కూటమి పాలన పట్ల ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. సభ్యత్వం తీసుకునే వారికి బీమా సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం పలువురి నుంచి సభ్యత్వాలను స్వీకరించారు. సమావేశంలో టీడీపీ నేతలు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, గాడి సత్యం, బ్రహ్మం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూలో ముగిసిన వర్క్‌షాప్



ఫారెస్ట్ కన్జర్వేషన్ బయాలజిస్టులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అటవీశాఖ సంరక్షణాధికారి దవాన్ మైధీన

ఆరిలోవ అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : జూలో విధులు నిర్వహిస్తున్న బయాలజిస్టులకు వృత్తిపరమైన మరిన్ని మెలకువలు తెలుసుకునేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని అటవీశాఖ సంరక్షణాధికారి బీఎం దవాన్ మైధీన పేర్కొన్నారు. ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో గత మూడు రోజుల నుంచి ఇందిరాగాంధీ జూ పార్కు, సెంట్రల్ జూ అథారిటీ, ఢిల్లీ వారి సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో 15 రాష్ట్రాలకు చెందిన కన్జర్వేషన్ బయాలజిస్టులు పాల్గొన్నారు. జూలో జంతువుల పరిరక్షణ, వాటి ఆరోగ్యం గురించి తెలుసుకోవడం, వారి అనుభవాలు చెప్పడం తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం అందరికీ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో జూ క్యూరేటర్ మంగమ్మ, జూ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో మేనేజర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న శామ్యూల్ నాగదేసి

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో శనివారం 'మేనేజర్స్ ఇన్ అండ్ ఆఫ్ డిజిటల్ ఎరా' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించగా, రిసోర్స్ పర్సన్‌గా ప్రముఖ చార్టెడ్ అకౌంట్, ఫౌండర్ పార్ట్నర్ ఆఫ్ శామ్యూల్ నాగదేసి అండ్ అసోసియేట్స్ శామ్యూల్ నాగదేసి ముఖ్యఅతిథిగాపాల్గొని డిజిటల్ యుగంలో మేనేజర్ల పాత్రను, ప్రాముఖ్యతను తెలియపరుస్తూ ప్రస్తుతం మేనేజర్స్, డిజిటల్ టెక్నాలజీ రెండు మిళితమై పని చేయవలసిన అవసరం ఉందన్నారు. డిజిటల్ రివల్యూషన్ అంటే ఇన్ఫర్మేషన్ రెవల్యూషనేనని ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఛాట్‌జీపీటీ వంటి నిర్ణయాలు తీసుకోవడం పాత్ర పోషిస్తున్నాయని, అయిన మానవ మేధస్సు ఆర్టిఫిషియల్ మేధస్సు కంటే ఎప్పుడూ గొప్పగానే పనిచేస్తుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక సంస్థలో విజయవంతమైన మేనేజర్‌గా పనిచేయాలంటే మారుతున్న టెక్నాలజీని మానవ అవసరాలకు ఉపయోగపడే విధంగా నేర్చుకోవాలని, మేనేజర్లు చేసే తప్పుడు నిర్ణయాల వలన బ్యాడ్ అకౌంటింగ్ వలన ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు మూతపడిపోయాయని, టెక్నాలజిని వ్యాపారాభివృద్ధికి వాడుకోవాలి గానీ బానిస అవ్వకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

రెట్టింపు సభ్యత్వం చేయాలి

- కార్యకర్తలకు ఎమ్మెల్యే వెలగపూడి పిలుపు



సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పార్టీ సానుభూతిపరులు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. శనివారం ఎంవీపీకాలనీలోని తన కార్యాలయం వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఓటరు కార్డుతో ఎమ్మెల్యే ఎన్‌రోల్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కంటే రెట్టింపు సభ్యత్వం చేయాలని క్యాడర్‌కు సూచించారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయం లభిస్తోందన్నారు. కార్యకర్తలకు ఉపాధి కోసం శిక్షణ, చదువుకునే విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు వంటికి పార్టీ చేపడుతుందన్నారు. అనంతరం నియోజకవర్గంలో పలు వార్డుల్లో సభ్యత నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చోడే పట్టాభి, కాళ్ల శంకర్, ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, నక్క కనకరాజు, గౌస్ పలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సులు పరిశుభ్రంగా ఉంచాలి

- అద్దె బస్సుల యజమానులతో ఆర్టీసీ విశాఖ రీజియన్ ఇన్‌చార్జి మేనేజర్ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అద్దె బస్సులు పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ ఇన్‌చార్జి మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సులో శనివారం ఆయన అద్దెబస్సుల యజమానులతో సమావేశమయ్యారు. బస్సుల నిర్వహణ సరిగాలేదని, అపరిశుభ్రంగా ఉంటున్నాయని, షెడ్యూల్ సమయం ప్రకారం బస్సులు నడవడం లేదంటూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వాటిని సరిదిద్దుకోవలసిన అవసరం ఉందన్నారు. అద్దె బస్సుల యజమానులు తమ డ్రైవర్లకు ఆర్టీసీ నియమాలు, నిబంధనలు తెలియజేయాలని అన్నారు. ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియోను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అద్దె బస్సుల యజమానులు తమ సమస్యలు వివరించగా, నిబంధనల మేరకు వాటిని పరిష్కరిస్తామన్నారు. అద్దె బస్సుల డ్రైవర్లకు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలని, వాటిని సకాలంలో చెల్లించాలని సూచించారు. డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ జి సత్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏయూ విద్యా విభాగం స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్, తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. దీనిలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచటం ద్వారా ఆరోగ్యం, ఏయూ క్యాంపస్ ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఇందులో విద్యార్థులు, ఉద్యోగులు, ఆచార్యులు అందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. విద్యావిభాగాధిపతి టి.షారోన్‌రాజు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు స్ఫూర్తినిచ్చారన్నారు.

ఏడాకుల చెట్లు తొలగించండి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారుల పక్కన నాటిన ఏడాకుల చెట్లను తొలగించాలని జీవీఎంసీ కమిషనర్‌కు సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు కమిషనరుకు వినతిపత్రం అందజేశారు. ఏడాకుల చెట్ల నుంచి విడుదలయ్యే వాయువు వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటులో వైసీపీ నేతల దందా

- జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో బాణసంచా దుకాణాల ఏర్పాటులో వైసీపీ నేతలు దందా చేస్తున్నారని జనసేన పార్టీ నాయకుడు, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శనివారం ఆయన మేఘాలయ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల ఏర్పాటుకు మైదానం లీజు నుంచి దుకాణాలకు అనుమతులు, సామగ్రి విక్రయం వరకూ అన్నీ వైసీపీ నేతలే దగ్గరుండి చూస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది దుకాణాల ఏర్పాటులో వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వయంగా తన చాంబర్‌లో సెటిల్‌మెంట్ చేయడం దీనికి నిదర్శనమని తెలిపారు. తాము సూచించిన వ్యాపారులకు కాకుండా ఇతరులకు అనుమతులు ఇవ్వకుండా జీవీఎంసీ అధికారులను డిప్యూటీ మేయర్ ఇబ్బంది పెట్టారని చెప్పారు. తర్వాత వ్యాపారులను తన ఛాంబర్‌కు పిలిచి బెదిరించి బలవంతంగా దుకాణాలు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. దీనిపై బాధితుడు మట్టపర్తి రామచంద్రరావు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వైసీపీ అధికారంలో ఉండడంతో కేసు నమోదు చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కూటమి అధికారంలోకి రావడంతో బాధితుడు సీపీకి ఫిర్యాదు చేయడంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీధర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారన్నారు.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిత

కంచరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డిగ్రీల కంటే నైపుణ్యం ఉంటేనే ఉజ్వల భవిత సిద్ధిస్తుందని విశాఖ పార్లమెంట్ సభ్యుడు శ్రీభరత్ పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో శనివారం ప్రతిభావంతులకు ధ్రువ పత్రాలు అందజేసే కార్యక్రమానికి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుతో కలిసి శ్రీభరత్ హాజరయ్యారు. ఎన్ని డిగ్రీలు ఉన్నాయన్నది ముఖ్యంకాదని, ఎంత నైపుణ్యం సంపాదించామన్నదే లక్ష్యంగా యువత కృషిచేయాలని పిలుపునిచ్చారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ప్రతిభ చూపడంతో ఆరుగురు విద్యార్థులు న్యూఢిల్లీలోని కౌశల్ భవనంలో సత్కారానికి ఆహ్వానం పొందడం అభినందనీయమన్నారు. ఇక్కడ ఐటీఐలో వెయ్యి మంది విద్యార్థులు 20 ప్రధాన ట్రేడుల్లో శిక్షణ పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. ఐటీఐలు నైపుణ్యలేమిని తగ్గించి యువత విజయం సాధించేలా తయారు చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందజేశారు. టీడీపీ నాయకుడు గండి బాబ్జి, బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిషిత్‌కు టెన్నిస్ చాంపియన్ టైటిల్



నిషిత్‌తో కోచ్ బాలకృష్ణ

విశాఖపట్నం స్పోర్ట్సు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐటీఎఫ్ వరల్డ్ టూర్ ఆఫ్ జూనియర్ టెన్నిస్ టోర్నీలో నగరానికి చెందిన నిషిత్ ఆరిమిల్లి చాంపియన్ టైటిల్ ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. శనివారం ఇథోపియా, ఆడిస్ అబాబాలో జరిగిన ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన వరల్డ్ 513 ర్యాంకర్ ఈజిప్టుపై అద్భుత ఆటతీరును ప్రదర్శించి 6,-2, 7-6 వరుస సెట్‌లలో గెలుపొంది చాంపియన్ టైటిల్‌ను సొంతం చేసుకుని వరల్డ్‌లో తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకున్నాడు. ఈ సందర్భంగా సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లు నిషిత్‌తోపాటు ట్రైనర్‌గా వ్యవహరించిన బాలకృష్ణను అభినందించారు.

సేవాభావం అలవరచుకోండి

▸▸ విద్యార్థులకు డీఆర్ఎం సూచన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, చిత్రంలో ప్రిన్సిపాల్ కమల్‌జిత్

అక్కయ్యపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సేవాభావం, మానవత్వపు విలువలు వంటి ఉత్తమ గుణాలను భావిభారత పౌరులలో పెంపొందించే కార్యక్రమమే స్కౌట్, గైడ్ శిబిరాల నిర్వహణ ఉద్దేశమని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం స్కౌట్, గైడ్స్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కలిసి మెలిసి మెలిగే స్వభావాన్ని విద్యార్థులు నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రిన్సిపాల్ కమల్‌జిత్ మాట్లాడుతూ శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన 25 పాఠశాలల నుంచి 178 మంది విద్యార్థులు, 25 మంది ఎస్కార్ట్ టీచర్లు పాల్గొన్నారన్నారు. వీరందరికీ క్రమశిక్షణతో కూడిన నైపుణ్యంపై తర్ఫీదు ఇస్తూ ప్రథమ చికిత్సపై అవగాహన, ఫైర్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శిబిరం నాయకుడు రమేష్‌బాబు, జగన్మోహనరావు, ప్రధానోపాధ్యాయిని వి.ఎం.శైలజ, ఉపాధ్యాయినులు విజయలక్ష్మి, సబ్రిన్, పూజ తదతరులు పాల్గొన్నారు.

1383 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు



తనిఖీలు చేస్తున్న అధికారులు

మురళీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డు భద్రత, వాహన ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు రవాణా శాఖ ఉప కమిషనర్ జి.ఆదినారాయణ అన్నారు. శనివారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 26 వరకు జరిపిన పలు దాడుల్లో 5,104 వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 1,383మంది డ్రైవింగ్ లైసెన్సులు తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు రోడ్డు భద్రత పాటించాలని సూచించారు. బైక్ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న ప్రయాణికుడు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. లేకుంటే కేసులు విధించేలా కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన విషయం డ్రైవింగ్ చేసే వారు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఆర్టీఏ విశాఖపట్నం ఉపప్రాంతీయ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

ఇక్కడ ఆక్రమణలకు అడ్డులేదు



ఆశవానిపాలెంలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

కంచరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జా చేయడమే పనిగా పెట్టుకున్నారు చాలామంది. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా పలుకుబడి వర్గాల వారి నుంచి సాధారణ ప్రజానీకం వరకు, నగరం, గ్రామం అనే తేడా లేకుండా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. కళ్లముందే ఈ తతంగం కనిపిస్తున్నా బాధ్యులెవరూ కట్టడి చేయడం లేదు. జీవీఎంసీ 57వ వార్డు పరిధి ఆశవానిపాలెంలోని ప్రధాన మార్గంలో చిల్లర వర్తకులు ఇష్టానుసారం దుకాణాలు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. మెయిన్ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లడానికి స్థానిక దుర్గాలమ్మ గుడి నుంచి రోడ్డు ఉంది. అసలే ఇరుకుమార్గం, దీనికితోడు వరుసగా బడ్డీలు, దుకాణాల ఏర్పాటు పేరిట స్థానికులు రోడ్డును ఆక్రమించుకున్నారు. గ్రామంలోకి వెళ్లాలంటే స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. సాయంత్రం కాగానే పలువురు ఈ దుకాణాల్లో బెల్ట్‌షాపులు కూడా నిర్వహిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. చీకటిపడగానే పలువురు మద్యం తాగి, ధూమపానం చేస్తూ, మార్గం గుండా వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారని పలువురు వాపోతున్నారు. తక్షణమే జీవీఎంపీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. చీకటిపడగానే యథేచ్ఛగా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

శివాలయం అభివృద్ధికి దాతల చేయూత



దేవాలయ ప్రాంగణంలో చేపడుతున్న పనులు

మురళీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి); సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఉప ఆలయాలైన మాధవధార క్షేత్రంలోని శ్రీభ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి దేవాలయంలో దాతల సాయంతో విస్తరణ పనులు చేపడుతున్నారు. ఆలయం ఎదుట ఈశాన్యం వైపుగా వాకిలి పెంచి కట్టడాలు చేపడుతున్నారు. ఈ మేరకు దేవస్థానం భూమిలోనే కొండపై ఉన్న ఆలయాన్ని సుమారుగా మరో 80 గజాల వైశాల్యం పెంచి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇరుకుగా మారడంతో పూజా స్థలాన్ని విస్తరిస్తూ పనులు చేపడుతున్నారు. భక్తులకు సౌకర్యాలను కల్పిస్తూ దాతల ముందు ఉంచిన ప్రతిపాదనకు సాయం అందడంతో ఈ పనుల్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ తెలిపారు. మరో వారంలో వచ్చే కార్తీక మాసం నాటికి పనులు పూర్తి చేసి శివారాధనకు కొండకు వచ్చే భక్తులకు ఉపయుక్తంగా వసతులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సింహాచలం దేవస్థానం అధికారుల అనుమతి కోరిన మీదట పనులు చేపడుతున్నట్లు వివరించారు. సుమారు వందేళ్ల చరిత్ర గల మాదవధార కొండపై ఉన్న ఈ శివాలయానికి కార్తీకమాసంలో భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ప్రతిరోజు దర్శనాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో మాధవధార పుణ్యక్షేత్రం కార్తీకశోభతో వెలుగొందుతుంది. అక్కడ కనీస వసతులు కల్పిస్తుండడం, ఆలయాన్ని విస్తరిస్తుండడంతో భవిష్యత్‌లో సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రేమ్‌కుమార్



కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్‌కు మొక్క అందిస్తున్న డీఈవో

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా ఎన్.ప్రేమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ బదిలీపై విశాఖ వచ్చారు. సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్న ప్రేమ్‌కుమార్‌కు రెండు కార్యాలయాల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీసు బ్యారెక్స్‌లో ఓపెన్ హౌస్

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు బ్యారెక్స్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు అధికారులు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈస్ట్ ఏసీపీ లక్ష్మణ్‌మూర్తి మాట్లాడుతూ పోలీసు శాఖ విధివిధానాలను విద్యార్థులకు వివరించారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనండి: ఎంపీ

మాధవధార, కంచరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొనాలని ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. శనివారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 48, 49 వార్డులు బర్మాక్యాంప్, ఏఎస్సార్ నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ శ్రేణులంతా పార్టీ పటిష్ట నిర్మాణానికి రాజీలేకుండా పాటుపడాలని సూచించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనతో అధోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర పోరాటం చేస్తున్నారన్నారు. ప్రతి వార్డులోను, గ్రామంలోనూ పార్టీ సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు ఉల్లాసంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, నాయకులు పి.శ్రీను, వెల్లంకి భరత్, మురళీ, వాసు తదితరులు పాల్గొన్నారు.



మొబైల్‌లో టీడీపీ సభ్యత్వ యాప్‌ను చూపుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్సీ దువ్వారపు, గండి బాబ్జీ, ఇతర నాయకులు

విశాఖ దక్షిణలో.. టీడీపీ సభ్యత్వ నమోదు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గం 37వ వార్డు చినజాలారిపేటలో శనివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. విశాఖ దక్షిణ ఇన్‌చార్జి శీతంరాజు సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, తెలుగు యువత అధ్యక్షుడు వలిశెట్టి తాతాజీ, వార్డు అధ్యక్షుడు కోనాడ చిన్ని, బంగారు రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు



విద్యార్థులతో సినీనటుడు అంకిత్ కొయ్యా సందడి

జ్ఞానాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎక్సెల్సియర్ యువజనోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. రెండో రోజు 80 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పాశ్చాత్య, దేశీయ నృత్యాలు, మూకాభినయం, లఘుహాస్య నాటికలు, ఫోటోగ్రఫీ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ముగింపు ఉత్సవాలకు వర్ధమాన సినీనటుడు అంకిత్ కొయ్యా విశిష్ట అతిథిగా విచ్చేసి విద్యార్థులతో కలసి సందడి చేశారు. ఆడి పాడారు. విద్యార్థులతో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. ముఖ్యఅతిథిగా క్రాఫ్ట్ బేకింగ్ యూనిట్ వ్యాపారవేత్త కె.నిరుపమ విచ్చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.షైజీ, పీకే జయలక్ష్మి, ఎక్సెల్సియార్ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కరసుధ, కమిటీ ప్రతినిధులు డా.హరిణి, పావని, ప్రమీల, వీణ, సోనీ, డా.రమణీలత తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో బాధ్యతల స్వీకారం



భవానీశంకర్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా బీహెచ్ భవానీశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఆర్వోగా ఉన్న మోహన్‌కుమార్‌ను చిత్తూరు బదిలీ చేసి ప్రభుత్వం..ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న భవానీశంకర్‌ను నియమించింది. కొత్తగా విధుల్లో చేరిన భవానీశంకర్‌ను కలెక్టరేట్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా బాధ్యతలు తీసుకున్న భవానీశంకర్ మర్యాదపూర్వకంగా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిశారు.

ఇబ్బందులు తొలగిస్తా: వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. అపరిష్కృత సమస్యలను పరిశీలించారు. ప్రజలతో సంభాషించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నమోదు చేసుకున్నారు. గొల్లలపాలెం అంగన్వాడీ కేంద్రం భవనం వేరొక చోట ఏర్పాటు చేయాలని, ఆర్‌టీ క్లబ్ మొదటి అంతస్తు స్లాబ్ నిర్మాణం, లలితా కాలనీ పార్కులో సమస్యలు, రజక వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ ఆవశ్యకతను పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల ఇబ్బందులు తొలగించేలా ప్రతి పనిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కలిసిన ప్రతినిధులు

సీతమ్మధార, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్, అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డు సభ్యుడు వెంగమాంబ శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, పి.మురళి, మహేశ్వరరాజు, కాంట్రాక్టర్ శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. పేదరిక నిర్మూలన, రైతులకు మద్దతు, కార్మిక సంక్షేమం, ఆహార భద్రత, అందరికీ ఇళ్లు, పరిశుభ్రమైన తాగునీరు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.

మాజీ ఎమ్మెల్యే దేముడుకు సీపీఐ ఘన నివాళి

అల్లిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హృదయాల్లో నిజమైన దేముడు చింతపల్లి మాజీ శాసనసభ్యుడు గొడ్డేటి దేముడని సీపీఐ విశాఖ జిల్లా సమితి శ్లాఘించింది. దేముడు 9వ వర్ధంతి సందర్భంగా శనివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, చింతపల్లి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన పార్టీకి ఎనలేని సేవ చేశారన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జీఎస్ జే అచ్యుతరావు, ఎస్కె రెహమాన్, జి.కాసులరెడ్డి, నూనెల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లి, చెల్లిపై కేసులు పెట్టేవాడు నాయకుడా?



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్

సీతంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్‌ఎస్‌ఎల్‌టీలో ఫిర్యాదు చేసిన విధానం ఏరు దాటక ముందు ఓడ మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న చందంగా ఉందని, తన సొంత తల్లి, చెల్లిని కోర్టుకు లాగిన ఆయన ప్రజలకు ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నారని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇంచార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ ప్రశ్నించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోడికత్తి శ్రీను కేసులో ఒక్కసారైనా కోర్టుకు రాని జగన్, బ్యాచ్‌మేట్ కోసం అద్దె హెలికాప్టర్‌లో జైలుకు వెళ్లి పరామర్శించారని ఎద్దేవా చేశారు. ఇంట్లోనే ముగ్గురి ఆడబిడ్డలను మోసం చేసిన మీరు మూడు కోట్ల మహిళలకు ఏ రకంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తన విజయానికి కృషి చేసిన షర్మిలపై కేసులు వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉత్తరాంధ్ర రీజినల్ మహిళా కో-ఆర్డినేటర్లు నాగలక్ష్మి, త్రివేణి, అమరాపు దుర్గ, జనసేన 15వ వార్డు అధ్యక్షులు యడ్ల కళ, గారపాటి లక్ష్మి, పద్మ, 27వ వార్డు జనసేన అధ్యక్షులు సురేష్‌బాబు, 34వ వార్డు ఇంచార్జ్ నారా నాగేశ్వరరావు, కోసూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి పుడితే ఆమడదూరం!

... 5వ పేజీ తరువాయి

నమోదైన 20 కేసుల్లో కొత్తగా వివాహమైనవారు ఐదుగురు ఉన్నారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టిందని మరో పది మంది వరకు, మూడో కాన్పులోనూ ఆడ పిల్ల పుట్టడంతో మరో ఇద్దరు ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరైతే మూడోసారి గర్భం వచ్చినప్పుడు ముందుగానే పరీక్ష చేయించి ఆడ పిల్ల పుడుతుందని చెప్పారంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటువంటి వేధింపులు భరించలేక బాధితులు డీవీ సెల్‌తోపాటు పెద్దల దృష్టికి తీసుకువెళుతున్నారు.

విడాకులు ఇచ్చేయాలని..

అమ్మాయి పుట్టిందని భార్యను పూర్తిగా విడిచిపెట్టేందుకు కొంతమంది సిద్ధపడుతున్నారు. ఇందులో కుటుంబ సభ్యులు ప్రమేయం కూడా ఉంటోంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ల మాటలు విని ఎంతోమంది భర్తలు విడాకులు నిర్ణయాన్ని తీసుకుంటున్నారు. ప్రసవానికని పుట్టింటి వద్ద దించి వస్తున్న వాళ్లు..ఆ తరువాత ఆడపిల్ల పుడితే అటు వైపు చూడడం లేదు. అమ్మాయి పుట్టింది కాబట్టి తనకు విడాకులు ఇచ్చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. స్థానికంగా పెద్దల సమక్షంలో పంచాయితీలు పెడుతున్నారని, వారు చెప్పినా వినిపించుకోకపోవడంతో తమ వరకు ఫిర్యాదులు వస్తున్నట్టు డీవీ సెల్ అధికారులు చెబుతున్నారు.

వైకల్యంతో పుట్టినా ఇబ్బందే..

పిల్లలు వైకల్యంతో పుట్టినా కొందరు తల్లిపై నెపాన్ని నెట్టేస్తున్నారు. డౌన్ సిండ్రోమ్, మానసిక సమస్యలు, చేతులు, కాళ్లలో వైకల్యంతో పిల్లలు పుట్టినా వదిలేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాదిలో ఇటువంటి కేసులు ఐదు వరకు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. పుట్టిన పిల్లల అవకరాలకు భార్యను బాధ్యులను చేసి విడాకులు ఇచ్చేందుకు సిద్ధపడడం అత్యంత దారుణమైన విషయమని డీవీ సెల్ అధికారులు పేర్కొంటున్నారు. ఆయా కేసులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, అయితే పరిష్కారం పెద్దగా లభించడం లేదని వాపోతున్నారు. తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా పురుషులు విడాకులు అన్న మాటను పట్టుకుని ఉంటున్నారని, కొందరు మెత్తబడినా కుటుంబ సభ్యులు అందకు అంగీకరించడం లేదని చెబుతున్నారు. దీనివల్ల కోర్టుల వరకు కేసులు వెళుతున్నట్టు చెబుతున్నారు. కొన్ని ఇప్పటికీ కౌన్సెలింగ్ దశలో ఉన్నాయంటున్నారు.

కారణం తండ్రే..

ఆడ పిల్ల, మగ పిల్లాడు ఎవరు పుట్టినా దానికి పురుషుడి క్రోమోజోములే కారణం. కానీ, ఈ విషయం తెలియక చాలామంది తల్లిని బాధ్యులుగా చూసి వేధింపులకు గురిచేస్తుంటారు. మహిళలో ఎక్స్‌ఎక్స్ క్రోమోజోమ్స్ ఉంటాయి. పురుషుల్లో ఎక్స్, వై క్రోమోజోమ్స్ ఉంటాయి. మహిళలో ఉండే ఎక్స్ క్రోమోజోమ్‌తో పురుషుడిలో ఉండే ఎక్స్ క్రోమోజోమ్ కలిస్తే ఆడ పిల్ల, వై క్రోమోజోమ్ కలిస్తే మగబిడ్డ పుడతారు. కానీ, ఈ విషయం తెలియక ఎంతోమంది పురుషులు ఆడ పిల్ల పుట్టడానికి తల్లిని బాధ్యురాలిని చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

లింగ వివక్ష నేరం

లింగ వివక్ష చూపించడం నేరం. ఇటువంటి వివక్ష చూపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. ఆడ పిల్ల పుట్టడానికి తల్లి కారణం కాదు. పురుషుడి క్రోమోజోమ్స్ వల్లే ఆడ పిల్లగానీ, మగపిల్లాడు గానీ పుడతాడు. దీనికి తల్లిని బాధ్యురాలిని చేయడం తప్పు. పిల్లలు పుట్టక ఎంతోమంది తల్లిదండ్రులు మథనపడుతున్నారు. ఈ మధ్యకాలంలో సంతాన లేమి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆడ, మగ అంటూ లింగ వివక్ష చూపించడం సమంజసం కాదు. అబ్బాయిలకు ఎందులోనూ తీసిపోని విధంగా అమ్మాయిలు రాణిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అబ్బాయిలు కంటే అమ్మాయిలే అనేక రంగాల్లో ముందంజలో ఉన్నారు. ఈ విషయంలో అపోహలు వీడి ఎవరు పుట్టినా అపురూపంగా చూసుకోవాలి. ఎందరికో ఉన్న సమస్య మీకు లేనందుకు ఆనందంగా ఉండాలి. **- డాక్టర్ టి.పద్మావతి, విశ్రాంత గైనకాలజిస్టు, కేజీహెచ్**

3 ఇసుక డిపోలు

... 5వ పేజీ తరువాయి

టెండర్లు పిలిచి తక్కువ మొత్తం కోట్ చేసిన సంస్థలకు స్టాకు పాయింట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. దీనికి సంబంధించి విధివిధానాలు రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం జారీచేయనున్నది.

ఒడిశా ఇసుకపై విజిలెన్స్: విశాఖ నగరానికి ఒడిశా నుంచి ఇసుక వస్తుండడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. గనులు, రెవెన్యూ, పోలీస్, రవాణా, పంచాయతీ రాజ్, జల వనరుల శాఖ అధికారులు, సిబ్బందితో కూడిన విజిలెన్స్ బృందం మూడు రోజుల క్రితం నగర శివారులో ఒక లారీని పట్టుకుని రూ.30 వేల జరిమానా విధించారు.

రూ.67కు కిలో కంది పప్పు

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అక్టోబరు నెలకు జిల్లా డిమాండ్‌లో 20 నుంచి 30 శాతం కందిపప్పు కేటాయించినా, గోదాములకు అంతకంటే తక్కువ వచ్చింది. రెండో వారం నాటికి మరికొంత సరఫరా చేశారు. అయితే నవంబరు నుంచి పూర్తిస్థాయిలో కందిపప్పు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీతో పౌర సరఫరాల సంస్థలో చలనం వచ్చి మిల్లర్ల నుంచి కొనుగోలు చేసి మరీ జిల్లాలకు సరఫరా చేశారు. దీంతో కార్డుదారులందరికీ కందిపప్పు, పంచదార అందిస్తామని డీలర్లు చెబుతున్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.180 వరకు ఉండగా కార్డుదారులకు రూ.67కు అందించనున్నారు. దీనికితోడు దీపావళి నుంచి ఉచిత సిలిండర్ పథకం ప్రారంభం కానున్నది. సోమవారం దీనికి సంబంధించి పూర్తి విధి విధానాలు రానున్నాయి.

'నిబంధనల ప్రకారం సేవలందించకపోతే చర్యలు'

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు అనుగుణంగా ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నెట్వర్కు ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స అందించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ యాజమాన్యాలను హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్య సేవలపై వచ్చిన ఫిర్యాదులను వివరించారు. పలు ఆసుపత్రులపై వచ్చిన ఫిర్యాదులను వివరించి జరిమానా విధించారు. సమావేశంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ

జ్ఞానాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ హరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, శ్రీ కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 7 వరకు మండల కాల మహా అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కంచుమూర్తి వెంకటరమణ మూర్తి తెలిపారు. వైర్లస్ కాలనీ కోదండ రామాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలధారణ చేసిన ప్రతి భక్తునికి మండలకాలం పాటు ఈ అన్నప్రసాద వితరణ చేస్తామని, ఏవరైనా దాతలు భక్తిభావంతో వస్తు, ధన రూపేణా ట్రస్ట్ పేరుతో సహాయం అందించి రసీదు పొందవచ్చన్నారు. దీక్షాధారులు ఇక్కడకు వచ్చి భిక్ష తీసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు కడగల శ్రీను, కె.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, సభ్యులు కోరాడ అప్పారావు, రామకృష్ణారెడ్డి, పి.అవతార్ స్వామి, అయ్యప్ప భక్తులు పలువురు పాల్గొన్నారు.



పూడికలతో నిండిన పెదగంట్యాడలోని గెడ్డ



జగ్గు జంక్షన్ వద్ద వ్యర్థాలతో నిండిన ప్రధాన కాలువ

ఇలాగైతే మురుగు పారేదెలా?

» పూడికలతో నిండిన ప్రధాన గెడ్డ
» తూతూమంత్రంగా చర్యలు చేపట్టిన అధికారులు
» పూర్తి స్థాయిలో వ్యర్థాలను తొలగించాలని కోరుతున్న ప్రజలు

పెదగంట్యాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత కాలనీల నుంచి పారే మురుగు, వర్షపు నీరు సముద్రంలోకి తరలించే పెదగంట్యాడలలోని ప్రధాన గెడ్డ పూడికతో నిండిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు దిగువకు ప్రవహించేందుకు వీల్లేకుండా పోతుంది. దీంతో ప్రధాన గెడ్డల్లో కలిసే మురుగు కాలువల్లో కూడా ఎక్కడికక్కడ నీరు నిలిపోతుంది. ఈ క్రమంలో గెడ్డలో పేరుకుపోయిన పూడికను తొలగించి మురుగు, వర్షపు నీరు సాఫీగా దిగువకు పోయేలా పనులు చేపట్టాలని జీవీఎంసీ, అదానీ గంగవరం పోర్టు అధికారులు భావించారు. ఇందులో భాగంగా గంగవరం పోర్టు బ్రిడ్జి ఎగువ భాగంలో గల గెడ్డ ప్రాంతంలో పూడికతీత పనులు చేపట్టి, దిగువ భాగాన్ని గాలికొదిలేశారు. దీంతో దిగువ ప్రాంతానికి మురుగు నీరు సజావుగా పారేందుకు పూడికలు అడ్డంకిగా మారడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది.

పాత గాజువాక వినాయక నగర్, వుడా కాలనీ, పెదగంట్యాడ నిర్వాసిత కాలనీ, తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీల నుంచి వచ్చే వాడుక నీరంతా చిన్న చిన్న కాలువల ద్వారా హౌసింగ్ బోర్డు కాలనీ దగ్గర గల ప్రధాన గెడ్డలో కలుస్తాయి. అక్కడ నుంచి పోర్టు బ్రిడ్జి దిగువ నుంచి నేరుగా సముద్రానికి కనెక్ట్ అయి ఉన్న గెడ్డ ద్వారా మురుగు నీరంతా సాగరంలో కలుస్తుంది. అయితే గెడ్డలో అధిక భాగంగా పూడికలతో నిండిపోవడంతో మురుగుతో పాటు వర్షాల సమయంలో పారే నీరు కూడా దిగువకు సక్రమంగా ప్రవహించడం లేదు. అందువల్ల జీవీఎంసీ, అదానీ గంగవరం పోర్టు అధికారులు స్పందించి గెడ్డలోని పూడికలను పూర్తి స్థాయిలో తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గాజువాకలో వ్యర్థాలతో నిండిన ప్రధాన కాలువలు

గాజువాక: గాజువాకలోని ప్రధాన కాలువలు చాలా వరకు వ్యర్థాలతో నిండిపోయాయి. గాజువాక ప్రధాన కాలువతో పాటు చినగంట్యాడ జగ్గు జంక్షన్‌లో, శ్రీనగర్‌లోని కాలువతో పాటు మరికొన్ని చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోవడంతో పాటు దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసేటప్పుడు నీటి ప్రవాహానికి కాలువల్లోని వ్యర్థాలు అడ్డంకిగా మారుతున్నాయి. దీంతో నీరు ముందుకు వెళ్లలేక రహదారులపై ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి.

అంతేకాకుండా మురుగు అంతా రోడ్లపైకి వస్తుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను కోరుతున్నా ఫలితం ఉండడం లేదని పలురువు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కుబడిగా కాలువల్లోని వ్యర్థాలను తీస్తున్నారే తప్పా పూర్తి స్థాయిలో తొలగించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించిన ప్రసాదుల శ్రీనివాస్, గొర్లె వెంకునాయుడు, తదితరులు

టీడీపీ సభ్యత్వం అంటే ఓ గౌరవం

గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, అక్టోబరు 26: పేద ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వం అంటే ఓ గౌరవమని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ప్రారంభించి, తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాల పరిమితో కూడిన నమోదు కార్డును టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి అందజేయడం జరుగుతుందని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీలో పల్లా శ్రీనివాసరావు గాజువాక ఎమ్మెల్యేగా విజయం సాధించారని, అదేవిధంగా రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వ నమోదును నియోజకవర్గంలో పూర్తి చేసి సీఎం చంద్రబాబుకు బహుమతిగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడు, నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు, తమిర శివప్రసాదరావు, పి.వెంకటేశ్వరరావు, పి.సోమినాయుడు, అడుసుమల్లి దీప్తి, పప్పు శంకరరావు, అప్పారావు, వి.కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



రాము కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి/పెందుర్తి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధిని నుంచి మంజూరైన చెక్కును బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అందజేశారు. సుజాతనగర్‌లో గల తన క్యాంపు కార్యాలయంలో శనివారం చింతలగ్రహారం గ్రామానికి చెందిన బాధితుడు రుత్తల రాముకు వైద్య ఖర్చులు నిమిత్తం రూ.1,19,119 చెక్కును ఎమ్మెల్యే పంచకర్ల అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోరిబిల్లి సంతోష్‌కుమార్, సదరం బీమేశ్వరరావు, రంగా జగదీశ్, శివ పాల్గొన్నారు.

రాజయ్యపేటలో రెవెన్యూ రీ సర్వే గ్రామసభ

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలలోని రాజయ్యపేటలో శనివారం రెవెన్యూ రీ-సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ హాజరై గతంలో జరిగిన రీ-సర్వేలో భూవిస్తీర్ణం తగ్గింపు, భూహక్కు పత్రాల్లో తప్పులు దొర్లిన రికార్డులు ప్రకారం సర్వే జరగకపోయినా తదితర అంశాలపై అర్జీలు అందజేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుని భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం వివిధ భూసమస్యలపై రైతుల నుంచి తహసీల్దార్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పిలి దేవి తదితరులు పాల్గొన్నారు.

రెండు బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు

ఏకేసీ కాలనీలో కార్డన్ సెర్చ్.. 30 మంది ఏఆర్ పోలీసులతో తనిఖీలు



నివాసితుడిని ప్రశ్నిస్తున్న సీఐ విద్యాసాగర్

మల్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అప్పుడే ఆ కాలనీ వాసులు నిద్ర నుంచి మేల్కొంటున్నారు. ఇదే సమయంలో ఒక్కసారిగా కాలనీలోకి పోలీసుల బూట్ల చప్పుళ్లు.. ఇళ్లలోకి చొరబడి తనిఖీలు నిర్వహించడంతో ఉలిక్కిపడ్డారు. ఇంతమంది పోలీసులు వచ్చారేంటి..? ఏం జరిగింది..? తీవ్రవాదులెవరైనా వచ్చారా..? దొంగలు చొరబడ్డారా? హంతకులెవరైనా కాలనీకి వచ్చి ఉంటారా..? ఇలా అనేక ప్రశ్నలు కాలనీ వాసుల మనసులలో లేవనెత్తాయి. ఈ తనిఖీలు మల్కాపురం పోలీసు స్టేషన్ వెనుకనే ఉన్న ఏకేసీ కాలనీలోనే జరగడం గమనార్హం. మల్కాపురం సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒకేసారి 30 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, మల్కాపురం పోలీసులు ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల మధ్య కార్డన్ సెర్చ్ చేశారు. ఇందులో రెండు బెల్ట్‌షాప్‌లను గుర్తించారు. వీటి నిర్వాహకులపై కేసులు నమోదుచేశారు. ఎటువంటి పత్రాలు లేని ఐదు మోటార్ బైక్‌లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాటి యజమానులు పత్రాలు చూపడంతో తిరిగి అప్పగించారు.

'బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభమైతే ఉక్కుకు మంచి రోజులు'



బీఎఫ్-1లో మంత్రి రాజశేఖర్, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్-1 విభాగాన్ని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వివిధ విభాగాల నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న ఈ విభాగాన్ని పునఃప్రారంభించనుండడం ఎంతో మంచి విషయమన్నారు. ప్లాంటులోని మూడు ఫర్నేస్‌లలో ఉత్పత్తి సాగేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఫర్నేస్‌లలో పూర్తి ఉత్పత్తి తీస్తే ప్లాంటుకు కొంత మేర ఆర్థిక కష్టాలు తీరి మంచి జరుగుతుందన్నారు. ఈ విభాగంలో నిరంతరం ఉత్పత్తి జరిగేలా చూడాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి ప్రభాకరరెడ్డి, ఎంఎస్.నాయుడు, పీవీ నగేశ్, పాల అప్పలరెడ్డి, సత్యారావు, గోవిందరాజులు, సుబ్బారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఘనంగా స్వాగతం పలుకుదాం

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులైన రాష్ట్ర గనులు,భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈ నెల 28న అనకాపల్లి రానున్నారని, ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. సుజాతనగర్‌లో దాట్ల కల్యాణమండపంలో శనివారం జనసేన శ్రేణులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని స్వాగతించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. అధిక సంఖ్యతో మంత్రి స్వాగతించేందుకు తరలిరావాలన్నారు.

ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో వీధి కుక్కల పట్టివేత

అగనంపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో వీధి కుక్కల పట్టివేతకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి వీధుల్లో సంచరిస్తున్న కుక్కలను వలతో పట్టుకుని వాహనాల్లో తరలించారు. పునరావాస కాలనీల్లో వీధి కుక్కల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాటిని సిబ్బంది పట్టుకున్నారు.

రహదారులకు మరమ్మతులు

గోపాలపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో గతకుల మయమై దుర్భరంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని కాలనీలు, గ్రామాల్లో చాలా చోట్ల రహదారులు గుంతలుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇవి మరింత దుర్భరంగా మారాయి. గుంతలుపడిన రహదారులకు జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణలో చురుగ్గా మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విత్తన బంతులు చల్లిన విద్యార్థులు

వేపగుంట, అక్టోబరు 26 : పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతు బాధ్యతగా ఆళ్వార్స్ హైస్కూలు విద్యార్థులు శనివారం సింహాచలం కొండ పరిసరాల్లో విత్తన బంతులను చల్లారు. విద్యార్థులకు చదువులు, ఆటపాటలతో పాటు సామాజిక బాధ్యతను తెలియజేసేందుకు స్వచ్ఛ సర్వేక్షన్, మొక్కలు నాటడం, విత్తన బంతులు చల్లడం వంటి కృత్యాలు అలవాటు చేస్తున్నట్టు హైస్కూల్ ప్రిన్సిపాల్ హేమచందర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎఎస్ భగవాన్, ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు పునాది మెడ్‌టెక్ జోన్

» విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్



0.35టీ పీసీఏ ఓపెన్ ఎంఆర్ఐ ప్రొడక్షన్‌ను ప్రారంభించిన శ్రీభరత్

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలకు మెడ్‌టెక్ జోన్ పునాదిగా నిలుస్తుందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో గల ట్రిమ్స్ మెడికల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో అత్యాధునిక 0.35టీ పీసీఏ ఓపెన్ ఎంఆర్ఐ ప్రొడక్షన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారతదేశ ఆరోగ్య సంరక్షణ తయారీ రంగానికి అద్భుతమైన అభివృద్ధిలో భాగంగా ఈ సంస్థ ఉత్పత్తిని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. సంస్థ ఉత్పత్తి అయిన 0.35 టీ పీసీఏ ఓపెన్ ఎంఆర్ఐ సిస్టమ్‌ను తయారు చేసిన భారతదేశ మొట్టమొదటి సంస్థగా నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ మిషన్ వల్ల రోగికి తక్కువ ఖర్చుతో సేవలు అందుతాయన్నారు. ఇక్కడ ఇటువంటి యంత్రాలను తయారు చేయడం వల్ల భారతదేశానికి దిగుమతి తగ్గుతుందని, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలకు మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించి నాడు నారా చంద్రబాబు నాయుడు ఇక్కడ మెడ్‌టెక్ జోన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలో అత్యాధునిక మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీని అందించడమే కాకుండా ఆసియా, ఆఫ్రికాలోని పొరుగు దేశాలకు సేవలందించే లక్ష్యంతో ఎగుమతి సామర్థ్యాన్ని పెంచుతామని పేర్కొన్నారు. మెడికల్ డయాగ్నోస్టిక్ ఇమేజింగ్‌లో అగ్రగామిగా ట్రిమ్స్ మెడికల్ మెడ్‌టెక్ జోన్‌లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



దయాళ్‌నగర్‌లో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


పెదగంట్యాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దయాళ్‌నగర్‌లో శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దయాళ్‌నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల విగ్రహాలు, వరిదుబ్బు ప్రతిష్ఠాపన కార్యక్రమాలను చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు తప్పెటగుళ్లు, మంగళవాయిద్యాల నడుమ నెల్లిముక్కు పెంటమాంబ ఆలయానికి చేరుకుని అక్కడ వరిదుబ్బుకు పూజలు చేశాక, దానిని దయాళ్‌నగర్ గౌరీ సేవా సంఘం కార్యాలయ ఆవరణకు తెచ్చి గౌరీపరమేశ్వరులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. నవంబరు ఒకటి వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు జరుపుతామని నిర్వాహకులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరిదుబ్బు ఊరేగింపు

మల్కాపురం: ఇక్కడి ప్రకాశనగర్‌లో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మల్కాపురం కూడలిలో ప్రత్యేక పూజలు చేశాక గౌరీదేవిగా భావించే వరిదుబ్బును ఊరేగింపుగా ప్రకాశనగర్‌లోని ఆలయానికి తీసుకువెళ్లారు. డిసెంబరు ఏడు వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 31న దీపావళి సందర్భంగా గౌరీపరమేశ్వరులను అన్నపూర్ణాదేవిగా అలంకరిస్తారు. నవంబరు 11 సాయంత్రం సామూహిక కుంకుమార్చన, 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా సహస్ర దీపాలంకరణ, 19వ తేదీ సాయంత్రం గౌరీ కల్యాణం, 24న అన్న సమారాధన, డిసెంబరు రెండున పోలిపాడ్యమి, ఏడున గౌరీపరమేశ్వరుల అనుపోత్సవాన్ని చేపడతామని పేర్కొన్నారు.

ఉత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను కాలనీ నాయకులు స్థానిక రామాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి నవంబరు ఐదు వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవాల పందిరిరాట వేశారు.



ఎంపీ సీఎం రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరిన ముమ్మన దేముడు, తదితరులు

బీజేపీలో చేరిన కార్పొరేటర్ 'ముమ్మన'

అనకాపల్లిలో కండువా కప్పి ఆహ్వానించిన ఎంపీ సీఎం రమేశ్

చినముషిడివాడలో బహిరంగ సభ

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి రాజీనామా చేసిన జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు బీజేపీలో చేరారు. శనివారం అనకాపల్లిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్ హాజరై.. ముమ్మన దేవుడు, ఆయన అనుచరులకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ రమేశ్ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం గల ముమ్మన చేరికతో ఉమ్మడి విశాఖ జిల్లాలో బీజేపీ బలోపేతం అవుతుందన్నారు. ముమ్మనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాగా కార్పొరేటర్ ముమ్మన దేవుడు పార్టీలోకి చేరిన సందర్భంగా చినముషిడివాడలో శనివారం రాత్రి ముమ్మన సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ భారీ బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ అనకాపల్లి జిల్లా ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ఈ సభలో వక్తలు మాట్లాడుతూ ముమ్మన దేవుడు చేరిక శుభపరిణామన్నారు. అనంతరం ముమ్మన దేవుడు మాట్లాడుతూ బీజేపీతోనే దేశ భవిష్యత్తు అని నమ్మి పార్టీలో చేరడం జరిగిందన్నారు. అనంతరం పార్టీ నేతలు ముమ్మన దేవుడుకు పార్టీ కండువా వేసి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొర్లె రామునాయుడు, బీజేపీ కన్వీనర్ కోన మంగయ్యనాయుడు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినముషిడివాడ సభకు హాజరు కాని ఎంపీ సీఎం రమేశ్

చినముషిడివాడలో జరిగిన బీజేపీ సభకు అనకాపల్లి ఎంపీ రమేశ్ హాజరవుతున్నట్టు ప్రచారం జరిగినా ఆయన రాలేదు. అయితే, ముమ్మన దేవుడు బీజేపీలోకి చేరికపై స్థానిక జనసేన, టీడీపీ శ్రేణులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్న సమాచారంతో సీఎం రమేశ్ సభకు గైర్హాజరైనట్టు తెలిసింది.

మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణించాలి

అగనంపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు తగ్గట్టుగా రాణించాలని అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహు అన్నారు. విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన టెక్నికల్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతికను ప్రోత్సహించేలా టెక్నికల్ ఫెస్ట్‌ను ఏర్పాటు చేయడం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే సాంకేతిక రంగంపై అందరూ పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను మనోజ్‌కుమార్ సాహు తిలకించారు. అదేవిధంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు మనోజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు అరుంధతి, జె.సుధాకర్, వై.శ్రీనివాసరావు, కన్వీనర్ వెంకటరమణ, అవినాశ్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఆటోనగర్, అక్టోబరు 26: పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీలను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఏపీ పటేల్ అన్నారు. శనివారం ఆటోనగర్ వాసీవాలో విశాఖ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటర్‌పెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరో అతిథి సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పలు రకాల ఉత్పత్తులు, నిర్మాణాలు, తయారీ రంగాల వస్తువులపై విధించే జీఎస్టీల గురించి వివరించారు. డీఐసీ జీఎం ఆదిశేషు మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు గల ఇండస్ట్రీస్ పాలసీలపై అవగాహన కల్పించారు. ఏపీఐఐసీ జెడ్ఎం జయబాబు పారిశ్రామికవేత్తలకు కేటాయించిన స్థలాలు, ఎంత చెల్లించాలి, ఏఏ రాయితీలు పొందవచ్చో వివరించారు. అనంతరం పటేల్‌ను ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కోశాధికారి పద్మావతి, అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఐలా కమిషనర్ కిశోర్, ఎన్ఆర్‌డీసీ డైరెక్టర్ సాహు, తెన్నేటి జయరాజ్ చంద్రమౌళి, ప్రభాకర్‌కుమార్, నిహారిక, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీకి జీవీఎంసీ నోటీసు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ రూరల్ మండలంలోని చినగదిలి సర్వే నంబర్-13పీ, 21పీ, 26పీలతో 7.95 ఎకరాలకు సంబంధించిన భూమిపై యాజమాన్య హక్కు పత్రాలు సమర్పించాలని విశాఖ డెయిరీకి జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ విశాఖ డెయిరీకి సంబంధించిన శిక్షణ కేంద్రం, హాస్టల్, పశువులశాల, పాల ఉత్పత్తుల కొనుగోలు కేంద్రం వంటివి ఉన్నాయి. ఆ భూమికి సంబంధించి వారం రోజుల్లోగా హక్కు పత్రాలు పంపాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నోటీసు ఇచ్చారు.

సినిమా గైడ్

- **వీనమ్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **విశ్వం :** శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 50, క్యాబేజ్ 28, క్యారెట్ 54, దొండకాయలు 36, బంగాళదుంపలు 31, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 60, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 48, కీరదోస 30, క్యాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 62, దేముడుచిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, మామిడికాయలు 100, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

నోరూరించే బేంబూ చికెన్



అరకు పర్యాటకులకు అదనపు ఆకర్షణ

- పర్యాటక ప్రాంతాల్లో జోరుగా వ్యాపారం
- తయారీ విధానం ప్రత్యేకం

అరకు అందాలు తిలకించేందుకు వెళుతున్నారా...అయితే కచ్చితంగా మీరు అక్కడి ప్రత్యేక వంటకం 'బేంబూ చికెన్' రుచి చూడాల్సిందే. ఇప్పుడు అరకులోయను సందర్శించే పర్యాటకులు లొట్టలు వేసుకుని మరీ తింటున్న ఆహార పదార్థం అదే. ఇంతకీ దాని ప్రత్యేకత ఏమిటంటారా...మనం మామూలుగా వండుకునే కోడి మాంసాన్ని వెదురు బొంగుల్లో ప్రత్యేక పద్ధతుల్లో ఉడికించి మనకు వడ్డిస్తారు. ఓస్...ఇంతేనా అని తేలిగ్గా తీసుకోవద్దు. చూడడానికి సులువుగానే కనిపించినా తయారుచేసే పద్ధతిలో అనుసరించే ప్రత్యేక విధానమే ఈ వంటకానికి ప్రత్యేక రుచి తీసుకువస్తుంది.

అరకులోయ, బొర్రాగుహలు, గాలికొండ వ్యూపాయింట్, బీసుపురం, సుంకరమెట్ట కాఫీ తోటలు, తాడిగుడ, కటిక, చాపరాయి జలపాతాలు వంటి సందర్శనీయ ప్రాంతాల్లో బేంబూ చికెన్ తయారు చేసేవారు వందలాది మంది ఉన్నారు. పర్యాటక ప్రాంతాల్లో బేంబూ చికెన్ తయారుచేస్తూ వీరంతా జీవనోపాధి పొందుతున్నారు. కిలో బేంబూ చికెన్ రూ.600కు విక్రయిస్తుంటారు.



బేంబూలో దట్టించిన చికెన్‌ను కాలుస్తున్న దృశ్యం

తయారీ ఇలా..

అడుగు ఎత్తు ఉన్న వెదురు బొంగులను తీసుకుని వాటిని శుభ్రం చేస్తారు. నాటు/బ్రాయిలర్ కోడి మాంసం ముక్కలను శుభ్రం చేసి మసాలా దట్టించి అర్ధగంట సేపు నానబెడతారు. ఆ తరువాత ముందుగా సిద్ధం చేసుకున్న వెదురు బొంగుల్లో కోడి మాంసాన్ని దట్టించి అడ్డాకులతో గట్టిగా బిరడాను ఏర్పాటుచేస్తారు. ఆ తరువాత ఆ వెదురు బొంగులను కట్టెలపై 15 నుంచి 20 నిమిషాల పాటు కాలుస్తారు. బిరడా మూతగా పెట్టిన భాగం నుంచి నీరు రావడం ఆగిపోయేంత వరకు కాలుస్తారు. అనంతరం కాసేపు చల్లార్చిన తరువాత అరిటాకు లేదా విస్తరాకు లేదా పళ్లెంలో వడ్డిస్తారు. చికెన్‌లో నీరు కలపకపోవడం, నూనె వినియోగించకపోవడం, పచ్చి వెదురుబొంగులో కాల్చడం వల్ల దీనికి ప్రత్యేక రుచి వస్తుంది. బేంబూ చికెన్‌లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని అంటారు. పచ్చి వెదురు బొంగులలో నీరుంటుంది కావున ఉడికించడానికి వేరుగా నీరు వాడాల్సిన అవసరం ఉండదు.



చికెన్‌ను వడ్డిస్తున్న దృశ్యం (ఫైల్)

వెదురు బొంగులోకి మసాలా కలిపిన చికెన్‌ను దట్టిస్తున్న గిరిజన మహిళ (ఫైల్)

జోరుగా వ్యాపారం

ఒకప్పుడు తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి ప్రాంతానికే పరిమితమైన బేంబూ చికెన్ ఇప్పుడు అరకులోయ ప్రాంతంలో ఫేమస్ వంటకంగా మారిపోయింది. ప్రస్తుతం దీనికి ఉన్నంత గిరాకీ ఏ వంటకానికీ లేదు. అనంతగిరి/అరకు వచ్చిన పర్యాటకులు తప్పనిసరిగా ఈ వంటకాన్ని రుచి చూడడం పరిపాటిగా మారింది. ప్రతీ పర్యాటక ప్రాంతంలో 60 నుంచి వంద మంది వరకు ఈ వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. పర్యాటక సీజన్‌లో ముగ్గురు చొప్పున ఒక జట్టుగా ఏర్పడి రోజుకు రూ.20 వేల వరకు వ్యాపారం చేస్తారు.

\- అరకులోయ/ఆంధ్రజ్యోతి



ఎంపీ సీఎం రమేశ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో సీఎం రమేశ్ పాత్ర కీలకం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- రమేశ్ ఉత్తరాంధ్ర రుణం తీర్చుకోవాలి: ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను ప్రపంచంతో కనెక్ట్ చేయడానికి ఎయిర్‌లైన్స్‌పరంగా తాను, రైల్వే పరంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కృషి చేయనున్నట్టు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సీఎం రమేశ్ దంపతులను శనివారం గ్రాండ్ బే హోటల్‌లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నేతృత్వంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ సీఎం రమేశ్‌కి స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ పదవి రావడం అందరికీ గర్వకారణమన్నారు. ఈప్రాంత నాయకులంతా టీమ్‌గా పనిచేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఈ వేదిక దానికి పునాదిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో సీఎం రమేశ్ పాత్ర కీలకంగా మారనుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గంటా మాట్లాడుతూ రమేశ్‌ను గౌరవించడం మనల్ని మనం అభినందించుకోవడమన్నారు. రమేశ్ నుంచి ఉత్తరాంధ్ర ప్రజలు ఎక్కువ ఆశిస్తున్నారని, ఆ మేరకు పనిచేసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకోవాలన్నారు. ఇంకా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్యే కూన రవికుమార్, వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అన్నమయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ముత్యాల నాయుడు తదితరులు ప్రసంగించారు. తనపై ఇంత ప్రేమాభిమానాలు చూపించి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని, ఈ ప్రాంత అభివృద్ధికి శక్తి మేరకు కృషి చేస్తానని సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు పాల్గొన్నారు.

క్రీడా సదుపాయాల కల్పనపై సమీక్ష



నాయకుల నుంచి ప్రతిపాదనల జాబితా తీసుకుంటున్న కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూపొందించాల్సిన ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర్ ప్రసాద్ శనివారం తన కార్యాలయంలో జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించారు. ద ఒలింపిక్ సంఘం ఛైర్మన్, ఎమ్మెల్యే గణబాబు, వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ కలిసి క్రీడాభివృది అంశాలపై చర్చించారు. సుదీర్ఘకాలం డిమాండ్‌కే పరిమితమైన అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్, హాకీ ఆస్ట్రో టర్ఫ్ ఫీల్డ్, మల్టీ స్పోర్ట్సు ఇండోర్ స్టేడియం, ప్రత్యేక ఫుట్‌బాల్ గ్రౌండ్ వంటి అంశాలపై చర్చించారు. క్రీడా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఒలింపిక్ భవన్ నిర్మాణం చాలా కాలంగా ప్రణాళికలకే పరిమితమవుతోందని, ఈ భవన్ అందుబాటులో ఉంటే క్రీడా సంఘాల కార్యకలాపాలు, టోర్నీల నిర్వహణ సమయంలో క్రీడాకారులకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. ఇటీవల కాలంలో బీచ్ క్రీడలకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో తీరంలో వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇక్కడి తీరం జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు అనుకూలమని వివరించారు. జిల్లాలో క్రీడా సంఘాల కార్యకలాపాలపై డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ వివరించగా, ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాఖ సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, ద ఒలింపిక్ సంఘం కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, మాజీ ఒలింపియన్ ఎంవీ.మాణిక్యాలు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, అర్జున అవార్డు గ్రహీత జయరాం, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

11లోగా పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

- డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నవంబరు 11వ తేదీలోగా ఫీజు చెల్లించాలని విశాఖ జిల్లా విద్యాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని పరీక్షలకు రూ.125 చెల్లించాలని పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్షలో మూడు, అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాసే అభ్యర్థులు రూ.125, రెండు సబ్జెక్టుల కంటే తక్కువ రాసేవారు రూ.110 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాల్సిన వారు రూ.80, వృత్తి విద్యా కోర్సులు చదివిన విద్యార్థులు రూ.60, వయో పరిమితి సడలింపును రూ. 300 ఫీజు చలానా సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలని డీఈవో పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడువు తేదీ వరకు వేచి చూడకుండా సాధ్యమైనంత త్వరగా పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫీజుల వివరాలు అందరికీ తెలిసేలా పాఠశాల నోటీసు బోర్డులో ఉంచేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని పెందుర్తి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ రాతి చెరువు వద్ద ఉన్న దుకాణానికి గురువారం రాత్రి గడగుండల శ్రీనివాస్ (35) వచ్చి అదే కాలనీకి చెందిన మరో వ్యక్తితో అకారణంగా వివాదానికి దిగాడు. ఈక్రమంలో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో శ్రీనివాస్ గాజు సీసాను పగలగొట్టి అవతలి వక్తి కంఠంపై పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలించి, నిందితుడు గడగుండల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సమాజాభివృద్ధితోనే వృత్తికి న్యాయం : డీఐజీ

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లు పన్ను అధికారులుగా తమ పాత్రను అర్థం చేసుకుని సమాజాభివృద్ధికి కృషి చేసినప్పుడే వృత్తికి న్యాయం చేసినట్టవుతుందని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ అన్నారు. అక్కయ్యపాలెంలోని కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లు, టాక్స్ అసిస్టెంట్లకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వానికి పన్ను సక్రమంగా వచ్చేలా అందరూ పనిచేయాలని సూచించారు. శిక్షణ కేంద్రం డైరెక్టర్ రవికిరణ్ ఈదర మాట్లాడుతూ ట్రైనింగ్ సమయంలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో ఉపయోగించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్

సీతకొండ మలుపులో సినిమా షూటింగ్

విశాలాక్షినగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోడుగుళ్లపాలెం, సీతకొండ మలుపు, తెన్నేటీ పార్కు ప్రాంతాల్లో శనివారం సినిమా షూటింగ్ జరిగింది. హాశ్యా మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరోగా సందీప్ కిషన్, హీరోయిన్‌గా రీతు వర్మ నటిస్తున్నారు. ఈమేరకు హీరో, హీరోయిన్‌పై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. బీచ్ రోడ్డులో షూటింగ్ జరగడంతో సందర్శకుల తాకిడి అధికంగా ఉంది.



సీతకొండ మలుపులో జరుగుతున్న షూటింగ్

కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ రాక రేపు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈ నెల 28న నగరానికి వస్తున్నారు. సోమవారం సాయంత్రం ఆయన ఢిల్లీలో బయలుదేరి రాత్రి 7.55 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి హోటల్ నోవాటెల్‌కు వచ్చి రాత్రికి బస చేస్తారు. 29వ తేదీ మంగళవారం ఉదయం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరినాకు చేరుకుని రోజ్‌గార్ మేళాకు హాజరవుతారు. అనంతరం నోవాటెల్‌కు వెళ్లి, అక్కడ నుంచి మధ్యాహ్నం 3.35 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొత్త పాలసీ

- రూ.50 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం... 22 లక్షల మందికి ఉపాధి
- పారిశ్రామికవేత్తల సదస్సులో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ టి.శివశంకర్



శివశంకర్‌ను సన్మానిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు త్వరలో కొత్త పాలసీని తీసుకువస్తున్నట్టు ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ టి.శివశంకర్ వెల్లడించారు. 'ఏపీలో నూతన అవకాశాలు, పెట్టుబడుల విధానాలు' అనే అంశంపై వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, టూర్స్ అండ్ ట్రావెల్ ఆపరేటర్స్ ఆఫ్ ఏపీ సంయుక్తంగా విశాఖలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, కొత్త పాలసీ ద్వారా రూ.50 వేల కోట్ల పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటి ద్వారా 22 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బాపట్లలో అగ్రికల్చర్ టెక్నాలజీ సెంటర్, నూజివీడులో ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ సెంటర్, తిరుపతిలో ఎలక్ట్రానిక్స్, అనంతపురంలో ఆటోమొబైల్, విజయవాడలో లైఫ్ సైన్సెస్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలు ఏవైనా సరే వాటికి అవసరమైన వాటిలో 25 శాతం ఎంఎస్ఎంఈల ద్వారానే తీసుకోవాలనే నిబంధన పెడుతున్నామన్నారు. ఏపీ మేరీటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి జిల్లాకు ఒక పోర్టు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సాగరమాల ద్వారా కొత్తగా 14 పోర్టులు నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా ప్రకటించినందున, రాయితీలు కూడా లభిస్తాయని చెప్పారు. ఇరవై పాయింట్ల కార్యక్రమం, సుపరిపాలన ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ, ఇంధన రంగంలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని, మూడేళ్ల తరువాత విద్యుత్ ధరలు తగ్గుముఖం పడతాయని చెప్పారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం : ఎంపీ శ్రీభరత్

ముఖ్యఅతిథి విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రతి రంగానికి ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకువస్తున్నదని, పారిశ్రామికవేత్తలు ఇచ్చే సలహాలు ఉభయ తారకంగా ఉండాలన్నారు. ఏదైనా విధానం అనుసరిస్తే ప్రభుత్వానికి కూడా ఆదాయం లభించేలా ఉండాలని సూచించారు. పరిశ్రమలకు నైపుణ్యం కలిగినవారు లభించడం లేదని, ఆ కొరత తీర్చేందుకు యత్నిస్తామని చెప్పారు. ప్రభుత్వానికి ఆదాయం పెరిగే మార్గాలు చెప్పాలని పారిశ్రామికవేత్తలను కోరారు. స్థానిక సంస్థలకు నిధులు పరిమితంగా ఉన్నాయని, పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులు ఇవ్వగలిగితే పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులైన విద్యుద్దీపాలు, సీసీ టీవీ కెమెరాలు వంటివి ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ ఛాంబర్స్ ప్రతినిధి భాస్కరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పరిశ్రమలకు రూ.10 వేల కోట్ల ప్రోత్సాహకాలు రావలసి ఉందని, దశల వారీగా ఇప్పించాలన్నారు. శ్రావణ్ షిప్పింగ్ అధినేత జి.సాంబశివ రావు మాట్లాడుతూ పోర్టుల నిర్మాణంతో పాటు వాటికి రహదారుల అనుసంధానం జరగాలన్నారు. ప్రతి పోర్టుకు ప్రత్యేకంగా ఐలా ఉండాలన్నారు.

ఆస్తిపన్ను విధానం మార్చాలి

వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్ ఓ.నరేశ్‌కుమార్ మాట్లాడుతూ భూములకు క్లాసిఫికేషన్ ఉన్నట్టే...పరిశ్రమలకు కూడా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి క్లాసిఫికేషన్ ఆధారంగా ఆస్తి పన్ను విధించాలన్నారు. ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ యజమాని విజయమోహన్ మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయానికి ఓపెన్ స్కై హోదా ఇప్పించాలన్నారు. బీచ్‌లను 24/7 తెరిచి ఉంచాలన్నారు. ఏపీ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ ప్రతినిధి పవన్‌కార్తీక్ మాట్లాడుతూ పర్యాటక రంగానికి బ్రాండింగ్ లేదని, యాప్ తేవలసిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉత్సవ్ వంటి ఈవెంట్లు తిరిగి నిర్వహించాలన్నారు.

తల్లిదండ్రుల ప్రమేయంతోనే విద్యార్థులకు మంచి చదువులు

- విద్యాశాఖాధికారుల సమీక్షలో కలెక్టర్

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తరగతి గదిలో చదివే ప్రతి విద్యార్థి పట్ల వారి తల్లిదండ్రులు ప్రమేయం తప్పకుండా ఉండాలని, విద్యార్థుల చదువు, అలవాట్లను ఎప్పటికప్పుడు వారు గమనించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అన్నారు. వచ్చే నెల 14న జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఆకార్ (ఆటోమోటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు నంబర్‌ను రూపొందించి ఆధార్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. నవంబరు 14న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం కోసం ఉపాధ్యాయులంతా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. దీనిపై ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు అవగహన కల్పించాలని, ఇందుకు సంబంధించిన వివరాలను పాఠశాలల ప్రార్థనా సమావేశంలో వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీకి భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. పాఠశాలల వారీగా సాధించిన విజయాలు, ఫలితాలు, ప్రవేశాలు, బోధనాపరమైన అంశాలతో కూడిన నివేదికను సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రవర్తన, చెడు అలవాట్లు, హాజరుపై టీచర్లు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆధార్ అప్‌డేషన్‌కు విద్యార్థులకు ప్రత్యేకించి ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమీక్షలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఇన్‌చార్జి ఉప విద్యాశాఖాధికారి రవీంద్రబాబు, పలువురు ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జీతాలు ఇవ్వకుండా ఉక్కు మంత్రిత్వ శాఖ కుట్ర'

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు కార్మికులకు జీతాలు ఇవ్వవద్దని ఆంక్షలు పెట్టి కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కుట్ర చేస్తున్నదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ అయోధ్యారామ్ ఆరోపించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల జీతాలు సగమే ఇచ్చారని, దీపావళి సందర్భంగా మిగిలిన జీతాలు ఇవ్వాలని ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 వరకు నలుగురు డైరక్టర్లతో అన్ని సంఘాల నాయకులు మాట్లాడితే, ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారన్నారు. ఢిల్లీ అధికారులు ఇవ్వవద్దని చెప్పినందున తాము ఏమీ చేయలేమని చెప్పారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరపాలని కోరారు.

గైనకాలజీ వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభం

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గైనకాలజీ వైద్య నిపుణులు 58వ వార్షిక నిరంతర వైద్య విద్యా సదస్సు (సీఎంఈ) శనివారం నుంచి ప్రారంభమైంది. పీఎంపాలెంలోని వీ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు సదస్సు జరగనుంది. తొలిరోజు గైనకాలజీ వైద్యంలో వచ్చిన అధునాతన పద్ధతులు, మహిళల్లో వస్తున్న సమస్యలు, వాటిని గుర్తించే విధానాలు వంటి వాటిపై చర్చించారు. అలాగే పలు వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముంబాయికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గౌరవ్ దేశాయ్, చెన్నైకు చెందిన డాక్టర్ రేఖా కురియన్, డాక్టర్ చలసాని కవిత, డాక్టర్ మెట్టా సందీప్, డాక్టర్ ఉషా ప్రసాద్, డాక్టర్ రాజ్యలక్ష్మి, విశాఖ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వైఎల్ నరసింగరావు, సెక్రటరీ కిరణ్మయి గొట్టాపు, డాక్టర్ టి రాధా, డాక్టర్ సీతారామరాజు, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ రామారావు, డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ శశిప్రభ, వాణి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శిరీష పాల్గొన్నారు. రెండో రోజు సదస్సుకు సీపీ శంఖబ్రత బాగ్చీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

కేజీహెచ్‌లో రొమ్ము కేన్సర్‌కు అధునాతన చికిత్స

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో రొమ్ము కేన్సర్‌కు ఉచిత అధునాతన చికిత్స అందుబాటులో ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. అవసరమైనవారు రేడియేషన్, కీమో థెరపీ శస్త్రచికిత్సలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అక్టోబరును రొమ్ము కేన్సర్‌పై అవగాహన నెలగా పాటిస్తున్నందున రేడియాలజీ, అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం కేజీహెచ్ సీఎస్ఆర్ భవనంలో రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ప్రమాద కారకాలు, రొమ్ము గడ్డలను గుర్తించే విధానం, స్వీయ పరీక్ష, మామోగ్రామ్ తదితర అంశాలను వివరించారు. కేజీహెచ్‌లో ఈ చికిత్సకు అవసరమైన వైద్యం ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందుబాటులో ఉందన్నారు. త్వరలోనే అధునాతన లింకా యంత్రాలు సమకూరుతాయన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్‌పై భయాందోళన చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, అంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ పాండురంగ కుమారి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.